శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!







# గురుకృప

విజయదశమి సంచిక



# గమ్యం

బాబాపథంలో నడవడం అనేటువంటిదే గమ్యం. నడుస్తూ ఉంటే నిజంగా నడుస్తున్నామా? నడుస్తున్నామని అనుకుంటున్నామా? ఇంకా ఎంత బాగా నడవవచ్చు. మామూలుగా నడవడం కాదు. కొంచెం క్యాట్‌వాక్ చేస్తామా? దాంట్లో ఇంప్రూవైజ్ చేసుకుంటూ పోండి. నడవడం అంటే ఊరికే నడవడం కాదు కదా! కుంటుతూ నడుస్తున్నామా? ఎట్లా నడుస్తున్నాము? అట్లా చక్కగా నడవడానికి ప్రయత్నం చేయండి. – అదే గమ్యం.

గమ్యం అంటూ వేరే ఏమీ ఉండదు. నేను ఎప్పుడూ మీ అందరికీ చెప్పేదొకటే. Means itself is a goal. ఎప్పుడో ఆనందం వస్తుందని మనం ఇప్పుడు కష్టాలు పడుతున్నామా? ఎప్పుడో వచ్చేది కాదు, ఇప్పుడే మనకు ఆనందం కావాలి. suffering through suffering, happiness అనేది కాదు. Happiness through happiness.

కాబట్టి means ను ఎక్కువ ఇది చేసుకోండి. ఇప్పుడు ఎట్లాగన్నా ఉండనీ మనం అనేది కరెక్ట్ కాదు. మీన్సే ఇంపార్టెంట్. ఇక గోల్ అంటావా అది బాబానే చెప్పారు "నువ్వు ఇలా ఉండు. నిన్ను చివరికంటా గమ్యం నేను చేరుస్తా" అని. నువ్వు ఇలా ఉంటూ చివరికంటా గమ్యం చేరు అని చెప్పలేదు ఆయన. "నేను చేరుస్తా" అన్నారు. కాబట్టి మనకు అప్పచెప్పినదేమిటి ఆయన? "మార్గం గురించే"

కాబట్టి Take care of the means. The end he will take care. ఆయన చూసుకుంటారు. లేకపోతే, మనకు ఇక్కడే ఉంది ఎండ్. మనకు ఇదే ఎండ్. ఎంత చక్కగా ఉన్నాం మనం. ఎంత నిశ్చింతగా ఉన్నాం. ఎంత హ్యాపీగా ఉన్నాం. ఇందాక నేను చెప్పింది అదే. ఒక సెన్సాఫ్ సెక్యూరిటీతో. హ్యాపీనెస్‌తో. ఏడుపు అనేది దగ్గరకు రానివ్వకుండా ఆనందంగా, మనకు ఉండేటువంటి హ్యాపీనెస్‌ని పదిమందికీ పంచుతూ, ఆ పంచడంలో ఇంకా హ్యాపీనెస్‌ని మనం పొందుతూ ఉండగలిగితే చాలు. హ్యాపీగా ఉండండి.

– శ్రీబాబూజీ.

సంపుటి : 23
సంచిక : 4

అక్టోబర్ 25
2020



గురుకృప




# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో



4 పథగామి - గురుకృప
9 ఎంపిక - 'శరచ్చంద్రికలు'
18 బాబా ఉంటే చాలు - డా॥ జి. సాయివరప్రసాదరావు
22 గురుకృపాలహరి - గురుకృప

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

**GURUKRUPA**

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## మనిషి దైవంగా ఎదగడం బాబా మతం

"అన్ని ఆధ్యాత్మిక గ్రంథాలలో ఏ పరమధర్మం, పరమసత్యం చెప్పబడి ఉందో ఆ తత్త్వానికి బాబా జీవితంలోని ప్రతీక్షణం ఆచరణపూర్వకమైన వ్యాఖ్యానమే! అనుక్షణం దానిని అనుభవరూపంలో చూపించారాయన. అంతటి మహిమాన్వితుడైన బాబా చెప్పినదేమిటి? "నేను చమత్కారాలు చేయను" అని. మరి ఆయన చేసినదంతా చమత్కారం కాక మరేమిటి? ఎక్కడో ఎవరికో బాధ కలిగితే ఇక్కడ చెబుతున్నారు. ఎక్కడో ఒక జీవికి రొట్టెపెడితే ఇక్కడ అది తనకు చెందినట్లు, తన ఆకలి తీరినట్లు చెబుతున్నారు. ఆయన ఒక మాటంటే అది జరిగి తీరుతుంది. ఆశీర్వదిస్తే దానికి తగినట్లు పరిస్థితులు అనుకూలంగా మారి అవసరాలు తీరేవి, బాధలు తొలగేవి. చమత్కారాలు చేయనన్న బాబా మరి చేసిందేమిటి? జీవులన్నింటిలోను ఉన్నది ఒకే చైతన్యం అన్న సత్యాన్ని తిరిగి తిరిగి గుర్తు చేస్తున్నారాయన. బాబా జీవితచరిత్రను చదివినట్లయితే అందరిలోనూ ఉన్నది ఒకే చైతన్యం. 'అది తానే' అన్న తత్త్వాన్ని గుర్తు చేయని లీల ఏదీ కనిపించదు. సాయిచరిత్రను శ్రద్ధగా మననం చేయడం వలన వచ్చే ఫలితం ఏమిటంటే ఏ పరమసత్యానికైతే ఆయన జీవితం మొత్తం సజీవ వ్యాఖ్యానమో, ఆ సత్యం అత్యంత సునాయాసంగా మన మనోఫలకం మీద ఎరుక లేకనే ముద్రితమవుతుంది" అంటారు శ్రీబాబూజీ. సద్గురుసామ్రాట్‌గా కొలవబడే శ్రీసాయి అవనిపై నడయాడిన ప్రతీ క్షణం వ్యక్తమయ్యింది అట్టి దైవత్వమే, అవ్యాజ ప్రేమతత్త్వమే. 'అల్లా' పేరు చెప్పి బిడ్డలెల్లా చల్లగా ఉండాలని సదా పరితపించిన ప్రేమశిఖరం వారు. అలా మూర్తీభవించిన ప్రేమ సర్వజీవ సమతగా, మమతగా, మాతృత్వంగా వ్యక్తమవుతూ, అన్ని జీవులలోను తానే ఉన్నానని దర్శనమయింది. తన బిడ్డలను కాపాడుకోవడంలో వారు సర్వకాల సర్వావస్థలయందు అప్రమత్తులే. వారు ఆశించింది కూడా మనం కూడా అట్టి ఆ చైతన్య స్వరూపాన్ని దర్శించగలగాలనే.

మనకు అవగతమయ్యింది మాత్రం దైవత్వం జాగృతం కావడం అంటే సిద్ధులను పొందడమని. ఉన్నది లేనట్లుగానో, లేనివి ఉన్నట్లుగానో లేదా చేతి నుండి రావడమో, చేతి నుంచి రాలడమో అన్న విపరీతార్థం ఆధ్యాత్మికతకు కలిగింది ఈనాడు. ఒక మహాత్ముడంటారు 'సిద్ధి' అంటే 'సంసిద్ధత' అని. శ్రీసాయి కృపావిశేషంగా లభించిన దానిని మరో ఆలోచన లేకుండా స్వీకరించగలిగే సంసిద్ధత. మానావమానాలకు, మోహావేశాలకు తలవంచక స్వీకరించే క్రమత, ఎటువంటి స్థితినైనా

మన మనసు బాబా మీద ఉండాలి. అలా ఉండటానికి ఏమి చేసినా అది సత్సంగమే.



సద్గురుచరణాలను తప్ప మరే తావును మనలను అర్పణ చేయని ధీరత. మేక తల నరకమని శ్రీసాయి ఆజ్ఞాపించిన క్షణాన తన అస్తిత్వము, వ్యక్తిత్వము రెండూ గుర్తుకురాలేదు దీక్షిత్‌కు. వారి గురుచంద్రులు చెప్పినమాట, చూపినబాట మాత్రమే ధర్మంగా గోచరించాయి. అటువంటి సంసిద్ధత మనకు రావల్సింది. మనలో నిలవాల్సింది.

***తండ్రికి తగ్గ బిడ్డలు :***

"ఆత్మావై పుత్ర నామాసి" తండ్రే బిడ్డగా జన్మిస్తాడు. అయితే ఆ సంస్కారాలను పుణికి పుచ్చుకున్ననాడు తండ్రిలా జీవిస్తాడు. మరో తరానికి తండ్రిలా దారి చూపిస్తాడు. గురుదేవులు శరశ్చంద్రుల విషయంలో అదే సాక్షీభూతంగా కనిపిస్తుంది. "దివ్యరూప దర్శనమివ్వుము సాయీ" అంటూ "ఏ చూపు అయితే అన్నింటినీ, అందరినీ తనలోని ఒక భాగంగా చూడగలదో అదే దివ్యదృష్టి" అని తెలియచెపుతూ వారి చెంతకు చేరే ప్రతీ జీవిని శ్రీసాయిలానే దర్శిస్తూ "సహస్రశిరస్సులు, సహస్రకరములు, సహస్ర పాదములు కలిగిన ఆ పురుషుడు – ఆ బాబా నాకు దర్శనం అనుగ్రహించడానికి వచ్చినట్లు అనిపిస్తుంది" అని వారి వైశిష్ట్యాన్ని తెలియచెప్పారు. బాబా ఎలా అయితే వచ్చిన ప్రతీ జీవిని అల్లా అప్పచెప్పుబడ్డ పైసలుగా తీర్చిదిద్దారో అలానే తమ చెంతకు చేరినవారిని శ్రీసాయి ప్రసాదంగానే స్వీకరించిన 'తండ్రికి తగ్గ బిడ్డ' వైనం ద్యోతకమవుతుంది–శ్రీబాబూజీ అవ్యాజప్రేమ ప్రస్థానంలో. దివ్యత్వమంటే మరో మాటలో దృష్టికోణం వికసించడమే కదా! దివ్యత్వమంటే ఆలోచన, ప్రవర్తన, ఆచరణాదులలో ఔన్నత్యమే కదా! ఇదే సద్గురు స్పృశించిన జీవితంలో సత్ప్రవర్తనగా సదాచరణగా, విలసిల్లగలదు. కొలిమిలో పడబోతున్న బిడ్డను కాపాడేందుకు తలపుతోనే తరలివెళ్ళి కాపాడిన వైనంలో తన తనువునే తనవారికై త్యాగం చేసిన సద్గురుచంద్రుని బిడ్డలు ఎలా ఉండాలి? గురువు పాదుకొల్పిన ఆశయాలు, ఆదర్శాల సాఫల్యసాధనలో ఎట్టి త్యాగానికైనా సంసిద్ధంగా ఉండాలి కదా! సద్గురుదర్శనమంటే కేవలం వారి స్వరూప దర్శనమా? సద్గురు దర్శనమంటే వారి స్వభావ దర్శనము. వారి జీవిత పర్యంతం వ్యక్తమయిన ఆదర్శముల దర్శనము – ఆ ఆదర్శములను అనుసరించే క్రమంలో అడుగడుగును విశ్లేషించుకుంటూ, మలయమారుతమైన వారి అనుగ్రహజాడలను దర్శించుకునే దివ్యసందర్శనము. ఎవ్వరైతే వారి గురుస్వరూపపు తేజస్సును హృదయమున పదిలపరుచుకొనుచూ, ఎదురయ్యే ప్రతీ సంఘటనలోనూ గురుచంద్రులనే ప్రమాణంగా తీసుకొని శ్రద్ధాళువులై చరిస్తారో వారే తండ్రికి తగ్గ బిడ్డలు కదా! గమనిస్తే పూజ్య గురుదేవుల జీవితమంతా



శ్రీసాయియే ప్రమాణంగా గోచరిస్తారు. తండ్రి అని తెలిసినంతనే బిడ్డలమవ్వగలమా? తోటివారి ప్రగతిని, సౌఖ్యాన్ని ఓర్వలేక మనం – తనువునే త్యజించి తరింపచేయాలని వారు. ఎంతసేపూ నాకేముంది అన్న కాంక్షలో మనం–ప్రక్కవాడికి పెట్టకుండా తినలేని ప్రేమలో వారు. సృష్టి, స్థితి, లయలకు బాధ్యులై జీవించారు వారు – ప్రాథమిక బాధ్యతలను కూడా బరువులుగా భావించే మనం. సర్వజీవులలోనూ సమానత్వాన్ని చూసారు వారు – సాటివారిని కూడా మనుషులుగా గుర్తించలేని మనం. మారేదా ఈ పరిణామం–మారాలి వాతావరణం. అందుకే సద్గురువు 'సత్సంగమనే' పాఠశాలను ప్రారంభించి మహితాత్ముల మానసాలను మహితపథంగా మనకందించి 'మార్పు' మనకవసరం లేకపోయినా తనకవసరమంటూ మనతో ఉంటూ, మనలో ఉంటూ గమ్యం చేర్చాలని యత్నిస్తున్నారు. 'తండ్రి'కి తగ్గ బిడ్డలుగా ఎదిగి తరించమని దీవిస్తున్నారు.

***'వెలుగు'వైపు పరుగు – 'నేను' కనుమరుగు :***

"నావైపు ఒక్క అడుగు వేస్తే నేను మీవైపు పది అడుగులు వేస్తానంటారు" శ్రీసాయి. శ్రీసాయి అనే వెలుగువైపు అడుగువేస్తే, వేస్తున్నామని తెలిస్తే, గమ్యం ఎంతసులభం – పదిరెట్లు సులభం. మనం 'వెలుగు'వైపు పయనిస్తుంటే, మనమనే 'నీడ' వెనుక వస్తుంది. అదే 'వెలుగు'కు అపసవ్యదిశలో పయనిస్తే మన 'నీడ'ను మనం అనుసరించాల్సి వస్తుంది. నిజానికి మన 'నీడ' మనమీద పెత్తనం చెలాయిస్తోంది. శ్రీసాయి అనే ప్రకాశమునకు భిన్నంగా వెడలిన ప్రతీసారీ మన అహపు నీడలే పెత్తనాలు చెలాయించి 'ఆనంద' జీవనయానానికి అడ్డమై, ముందరి కాళ్ళకు బంధాలై ముందుకు సాగనీయకుండా చేస్తున్నాయి. 'సద్గురు'వనే 'వెలుగు' ప్రకాశంగా దర్శనమిస్తుంటే కేవలం పూజాదికాల తంతుల పళ్ళాలు పట్టుకొని బహుపరాక్ అంటే సరిపోతుందా? ఆ వెలుగువైపు పయనించడం అంటే తుమ్మెద మాదిరి వారి జ్ఞానమధువును ఆస్వాదించి, పరవశించి ప్రతీ అడుగును గురువే ప్రమాణంగా, సద్గురు చరణాలకు ప్రణామంగా మలచుకోవాలి. అయ్యో! బురదలో ప్రభవించాల్సి వచ్చిందే అని వాపోలేదు కమలం. కాంతివంతంగా, కమనీయంగా, కోమలంగా వికసించింది, విలసిల్లింది. అలాంటి కమలం దగ్గర కప్పల్లా ఉండిపోవడమా, తుమ్మెదగా మారి వారి జ్ఞానమధువును ఆస్వాదిస్తూ తరించడమా? 'వెలుగు'కు అపసవ్యంగా ప్రయాణించి 'నీడ'ల జాడలు వెతుక్కోవడమా? అఖండమైన ఆ అవ్యాజప్రేమ వెలుగువైపు ఆచరణ, అనుసరణ అనే అడుగులతో ఆ వెలుగులో

ఏకమవ్వడమా? ఏది శ్రేయస్కరమో, శ్రేష్టమో ఆలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీళ్ళతో కూడా దీపాలు వెలిగించగల సర్వశక్తిమంతం శ్రీసాయిస్వరూపం. మన చెంత ఉన్న 'నూనె'ను తీసుకొని, తన 'ప్రేమాగ్ని'లో దీపంగా మలచాలని వారి ప్రయత్నం. వారే మన వద్దకు వచ్చి చేయిపట్టి నడిపించి గమ్యం చేర్చాలని వారి మాతృత్వపు మహితతత్త్వం.



**వ్యక్తిత్వంలోని శ్రేష్టత్వమే భక్తి :** 'బుద్ధి'ని సిద్ధించుకున్న ఒకే ఒక్క జీవి మానవుడు. సంకల్పిస్తే తన ఆలోచనలను, ఆచరణను అదుపులో పెట్టుకోగల జీవి మానవుడు. వ్యక్తిత్వాన్ని శ్రేష్టంగా మలచుకున్న మానవుడే–మాధవుడు అంటే భగవంతుడే. "వెయ్యి అవరోధాలు ఎదురైనా వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలి అంటారు స్వామి వివేకానంద. వ్యక్తిత్వనిర్మాణం అంత సులభమైన పనా అంటే సాధ్యమే! అవశ్యకం – నిరంతర సంబంధం (Constant touch). స్వర్ణకారునిగా వృత్తి... మేలిమి బంగారమయిన శ్రీసాయి సాంగత్యంతో శోభిల్లిన ప్రవృత్తి మహల్సాపతిది. తానెక్కడున్నా మనసు మాత్రం శ్రీసాయితో ఏకమై, శ్రీసాయి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ,పరిభ్రమిస్తూ ఉండిపోయింది. వారి వ్యక్తిత్వం నేటి తరాలకు ఆదర్శమయ్యింది. శ్రీసాయి ఇచ్చిన దానిని కాక దేనినీ స్వీకరించని శ్రేష్ట వ్యక్తిత్వం వారిది. వారి ఆదర్శాల వెలుగులలో కుటుంబంలోని వారిలో కూడా అదే శీలనిర్మాణం గమనించగలుగుతాం. మహల్సాపతి బాటలోని మనమూ శ్రీసాయిని ఉపాసనా దైవంగా చేసుకోవడం, శ్రీసాయి సద్గురుచంద్రులు చూపిన దారిన వేసే అడుగులను ఉపాసించడం, వారి అడుగుజాడలలో నడుస్తూ సదా వారి సమీపంలో ఉండటం అత్యావశ్యకం. దేహరూపంలో మనతో చరించి, దివ్యత్వపు పరిమళాలను మనకు రుచిచూపించిన ఆ మహితాత్ములు ఆచరించి చూపిన బాటలో మన వ్యక్తిత్వాలను నిర్మించుకుంటే వారి నిరంతర సన్నిధి మనలోనూ అంకురించే అవకాశముంటుంది. "ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు" అంటూ "నీ వలన కొరతే లేదు, మరి నీరు కొలది తామరవు – ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే ఊరియనట్లు" అంటారు పదకవితా పితామహుడు అన్నమయ్య. గురువనే భాగీరథి ఒడ్డున నివసించే గుణం అలవరచుకుంటే మన మనసనే బావినుండి వారి దివ్యత్వమనే జలాలే ఊరతాయి. అయితే మనం వారిని ఎంతమాత్రమని తలుస్తామన్నదే శేషప్రశ్న. అతివృష్టి, అనావృష్టికి గురికాక అహరహము స్థిరంగా ప్రవహిస్తూ, సాగిపోయే జీవనది 'సద్గురువు'. ఆ జీవనదిలో నిరంతర సాంగత్యమరపిన జీవులు శ్రేష్టతములై పరిణితి చెందగలరు.



**'అర్థ'మెరిగి జీవించు... 'అర్థవంతం'గా జీవించు :** "నా ఖజానా నిండుగా ఉంది, త్రవ్వి ఈ ధనమును తీసుకుపోండి" అన్నారు శ్రీసాయి. "మీకందరికీ బాబా అనే లక్షరూపాయలిచ్చా, దాన్ని అజాగ్రత్తగా పారేసుకుంటారా? జాగ్రత్తగా తడుముకుంటూ చూసుకుపోతారా" అన్నారు శ్రీబాబూజీ.

బాబా, గురువుగారు చెప్పిన ధనం 'ఆనంద'మేమో ఆలోచిద్దాం. వారి ఆనందమనే ఖజానా ఎప్పుడూ నిండు తకుండే. "దంభో దర్పోభిమానశ్చ క్రోధః పారుష్యమేవచ"... "కుల రూప విద్యా ధనజనిత దంభము, దర్పము, అభిమానము, క్రోధము, పరుష వాక్కులతో ఇతరులను దూషించటమనే" లక్షణాలతో ఆనందజీవనానికి ఆమడదూరంలో నివసిస్తున్నామంటుంది భగవద్గీత. ఈ అవలక్షణాలను విడిచి ఆనందజీవనానికి బాటలెలా వేసుకోవాలో నేర్పుతోంది సద్గురుచంద్రుల చరిత. స్తోత్ర పాఠాలు చదివి 'ఫలశ్రుతి'పై శ్రద్ధ వహించామే గానీ, 'శృతిఫలం'పై భక్తి కొరవడింది. కేవలం ఫలాల కోసం పరుగులిడితే అవీ లభించవచ్చు. కానీ గురువు చూపిన బాటలోని జీవన శ్రుతులను అధ్యయనం చేసి ఆచరిస్తే, సద్గుణ సంపన్నులమై జీవన సాఫల్యాలను పొందగలము. సద్గురుచంద్రులు ఇద్దామనుకుంటున్న 'అర్థం' (ఐశ్వర్యం) ఏమిటో అర్థమైతే జీవితమంతా అర్థవంతంగా జీవించగలం. రాబోయే తరాలకు దారి చూపగలం. అందుకే అన్నారు శ్రీసాయి "నా మాటలకర్థం మీకు సరిగ్గా బోధపడలేదు. నేను చెప్పిన మాటల్లోని అర్థాన్ని గ్రహించి జాగ్రత్తగా ఆచరించు" అని. సద్గురు చరణకమలాలకు అంజలి ఘటించి ప్రార్థిద్దాం – వారి అంతర్యమెరిగి అర్థవంతంగా జీవిద్దాం.

## ఉత్కృష్ట భావనలు

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కిశోరావస్థలోనున్నపుడు ఒకనాడు ఒక స్నేహితుని వెంటపెట్టుకొని వచ్చి తల్లికి పరిచయం చేస్తూ, ఇతడు 'ఫీజు' కట్టడానికి ధనంలేక పరీక్ష రాయలేకపోతున్న నా స్నేహితుడు. నీవేమైనా సహాయం చేయగలవేమోనని నీ వద్దకు తీసుకొని వచ్చాను అని చెబుతాడు. తల్లి వెంటనే మెడలో నున్న ఒక్కగానొక్క మంగళసూత్రాన్ని తీసి అమ్మివేసి ఆ బాలుని 'ఫీజుకి' ఏర్పాట్లని గావిస్తుంది. ఆ బాలుడు పరీక్షలో ఉత్తీర్ణుడై ఆమె పాదాలకు నమస్కరిస్తూ మంగళసూత్రాన్ని తీసుకున్నందుకు ఎంతగానో దుఃఖిస్తాడు. ఆమె ఆ బాలుని అక్కున చేర్చుకుంటూ, నాయనా! దాని పేరే మంగళసూత్రం. కాబట్టి మంగళకరమైన ఒక పనికి ఉపయోగపడింది. దీనిలో దుఃఖించవలసినదిగాని, విచారించవలసినదిగానీ ఏమీ లేదని ఓదారుస్తుంది. ఇటువంటి మహోన్నతురాలైన తల్లి ఒడిలో పాఠాలు నేర్చుకున్న భాగ్యశాలి గనుకనే ఈశ్వరచంద్ర విద్యాసాగర్ హృదయంలో బాల్యం నుండి కూడా కలిగినదాన్ని పంచుకొని తినాలని, ఆత్మీయతతో కలసి జీవించేటటువంటి ఉత్కృష్ట భావనలు ఉద్భవించాయి.

**– సేకరణ : ప్రజ్ఞాపురాణం నుండి**



# ఎంపిక



హైదరాబాద్, 1998

**భక్తుడు :** గురువుగారూ! సద్గురు మానసిక స్థితిని క్షణమాత్రంగానైనా అనుభవంలోకి తెచ్చుకోవడం గురించి మీరు చెబుతూ, ఆ స్థితి ఒక్క క్షణమాత్రంగానైనా అనుభవంలోనికి వచ్చాక ఆ ఆనందానుభవాన్ని నిలుపుకోవడం లేదా దానిని వదులుకోవడం మా చేతుల్లోనే ఉందని తెలుస్తుంది అన్నారు. నిజంగా ఆ అనుభవాన్ని నిలుపుకోవడం లేదా వదులుకోవడం అనే ఎంపిక (ఛాయిస్) మా చేతుల్లోనే ఉందా?

**గురువుగారు :** అది ఎంపికే. అది మన చేతుల్లోనే ఉంది. కానీ నిజానికది ఎంచుకోక తప్పని నిర్బంధమైన ఎంపిక (ఛాయిస్‌లెస్ ఛాయిస్). అది మన ఎంపికే అనిపిస్తుంది. కానీ వాస్తవంగా మనకు మరోలా ఎంచుకునే అవకాశం ఉండదు. ఈ విషయంలో మాత్రమే కాదు, జీవితంలోని ప్రతి విషయంలోనూ ఇలాంటి పరిస్థితే ఉంటుంది. మన 'ఎంపిక' అనే విషయం చాలా గమ్మత్తుగా ఉంటుంది. ఇలా ఎంపిక చేసుకోవడమనేది చాలా వరకు మన పాత అలవాట్ల మీద ఆధారపడి ఉంటుంది. నిరంతరం క్రొత్తదనం కోసం చూడటం మన అలవాటు కనుక మనం ఆనందానుభవం నుండి ప్రక్కకు మరలుతాం.

**భక్తుడు :** గురువుగారూ! మాకు వచ్చిన అనుభవాలన్నీ (మీరు) ఇచ్చినవే. వాటిని పొందడానికి మేము ఏమీ చెయ్యలేదు. కనీసం ఆ అనుభవాలు రావడం ఆగకుండా ఉండటానికైనా మేము చెయ్యగలిగింది ఏదైనా ఉందా?

**గురువుగారు :** ప్రతిదీ ఇచ్చిందే, దేనినైనా 'ఆపడం' ఎలా సాధ్యం? ఆ ఆనందానుభవం మాత్రమే కాదు, మన అనుభవాలన్నీ ఇచ్చినవే. ఆ అనుభవాలను మనం ఎలా చూస్తాం, మనం వాటిని ఎలా స్వీకరిస్తాం, వాటిని ఎలా అర్థం చేసుకుంటాం అనే ఈ విషయాలను బట్టి ఆ అనుభవం మన ఎంపికే అన్న భావన వస్తుంది. మీ జీవితంలో మీకు ఎదురయ్యే ఏ అనుభవాన్నైనా తీసుకోండి. అది నిజంగా మీరు ఎంచుకున్నదేనా? ఉదాహరణకు, మీరు ఈ మార్గాన్ని (సాయిపథాన్ని) ఎన్నుకున్నారని అనుకుంటున్నారు. కానీ ఇది నిజంగా మీ ఎంపికేనా? నిజంగా మనకు అలా ఎంపిక చేసుకునే సామర్థ్యం ఉందా? సాధారణంగా అందరూ వాళ్ళ జీవితాలు వారి నిర్ణయం ప్రకారమే



ఉన్నాయనుకుంటారు. తమకు అలా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉందనుకుంటారు. ఎవరైనా ఆధ్యాత్మికపథంలోకి వస్తే వారికి ఇక వ్యక్తిగత నిర్ణయాలు ఉండవనే భావనతో ఉంటారు. అంతకుముందు వాళ్ళకేదో ఆ అవకాశం ఉన్నట్లు, ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత దానిని కోల్పోతారని అనుకుంటారు. నేనేమంటానంటే మీరిప్పుడు కోల్పోవడానికి ఏమీ లేదు, ఎందుకంటే అసలు మీకెప్పుడూ అలా ఎంపిక చేసుకునే అవకాశం లేదు (గురువుగారు నవ్వుతూ) ఏ విషయాన్నైనా తీసుకోండి – మీరు ఎక్కడ నివసిస్తారు, ఎలాంటి దుస్తులు ధరిస్తారు, ఏమి తింటారు, ఎప్పుడు నిద్రలేస్తారు – ఇలా ఏదైనా చిన్న విషయాన్ని, ఏ ప్రాముఖ్యతా లేనటువంటి విషయాన్ని తీసుకొని దాని గురించి లోతుగా ఆలోచించడానికి ప్రయత్నించండి. మీకు పెద్దగా ఎంపిక చేసుకునే అవకాశం లేదనే విషయంతెలుస్తుంది.

**భక్తుడు :** కానీ చాలాసార్లు మాకు ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నట్లనిపిస్తుంది.

**గురువుగారు :** నిజమే, అది అలా అనిపిస్తుంది.

**భక్తుడు :** ఉదాహరణకు, సత్సంగంలో నేను ఇక్కడైనా కూర్చోవచ్చు లేదా మీ ముందు అక్కడైనా కూర్చోవచ్చు.

**గురువుగారు :** అలాకాదు, ఒకవేళ అది మీ ఎంపిక అయినట్లయితే మీరు ఇక్కడ కూర్చొని ఉండేవారు. (గురువుగారు తమ పాదాల చెంత ప్రదేశాన్ని చూపుతూ) (నవ్వులు) మీరు వచ్చేటప్పటికి ఉన్న చోటులో ఉత్తమమైన ప్రదేశాన్ని ఎంచుకునే ప్రయత్నం చేస్తారు. ఆ జాగా దొరక్కపోతే మళ్ళీ ఉన్న దాంట్లోనే మంచిది అనుకున్న చోటులోనే కూర్చోవాలనుకొంటారు. కానీ అలా చివరికి దొరికిన దానితో సంతృప్తిపడి, “ఇది నేను ఎంచుకున్న స్థానం” అనుకుంటారు.

**భక్తుడు :** కానీ, మా అనుభవంలో ఎంచుకునే అవకాశం ఉన్నట్లనిపిస్తుంది. ఇక్కడ కూర్చోవచ్చు లేదా అక్కడ కూర్చోవచ్చు.

**గురువుగారు :** అవును. నేను చెప్పేదీ అదే, ప్రతీ ఒక్కరూ అలాగే అనుకుంటారు. ప్రతి ఒక్కరూ ఇది నేను ఎంపిక చేసుకున్నదే, నేను ఎంపిక చేసుకున్నదే అంటారు. ఆ భావననే వేదాంత పరిభాషలో ‘అజ్ఞానం’ అన్నారు. **ఆ ‘అజ్ఞానం’ మీ తలకు వెనుక భాగంలో ఎక్కడో లోపల లేదు. అది మన ప్రతి పనిలో, ప్రతి ఆలోచనలో, ప్రతి శ్వాసలోనూ ఉంది. అది అలా మనల్ని మాయచేస్తూ ఉంటుంది.**

**భక్తుడు :** అలా అయినపుడు అది నా ఎంపిక కాకుండా చేసేది ఏమిటి?



**గురువుగారు :** అన్వేషించండి, తెలుసుకోవడానికి ప్రయత్నించండి! దానిని అనుభవంలోనికి తెచ్చుకోవడం అంత సులభం కాదు. ఊరకే, "ఇప్పటిదాకా నేను ఎంపిక చేసుకోవచ్చు అనుకున్నాను, కానీ మనకు ఆ అవకాశం లేదని చెప్పారు. కాబట్టి ఇక నేనలా ఆలోచించడం మానేస్తాను" అని అనుకొన్నంత మాత్రాన సరిపోదు. అది అంత సులభం కాదు. ఎవరైనా దానిని తెలుసుకొని అనుభవంలోకి తెచ్చుకోగలిగితే మనకు అనుభవమయ్యే ఆ స్థితిని రకరకాల సాంప్రదాయాలు, "ఎంపిక లేని ఎరుక" **(Choiceless awareness)** అని పిలుస్తాయి. మనలో ఎవ్వరికీ ఎంపిక చేసుకునే అవకాశం లేదు. కానీ మనకు ఈ విషయం పట్ల ఎరుక ఉండదు. మన మొత్తం ఉనికి ఎంత నిర్బంధమైందో, అది అలా ప్రవాహంలో ఎలా కొట్టుకుపోతుందో తెలిస్తే, ఆ ప్రవాహాన్ని గుర్తించడం నేర్చుకోగలిగితే – ఏదో ఒక్క క్షణం గుర్తించడం కాదు, దానిని నిరంతర అనుభవంగా గుర్తించగలిగితే – అప్పుడు మనం ఆ "ఎంపిక లేని ఎరుక"లో ఉంటాము. ఎంపిక చేసుకునే అవకాశం లేని స్థితి అందరికీ ఉంటుంది. అది కాదు సమస్య. అసలు సమస్య 'ఎరుక' – మనకు ఆ ఎరుక లేదు (నవ్వులు...)

**భక్తుడు :** మనకు ఎంపిక చేసుకునే అవకాశం లేదనే ఎరుక కలిగినపుడు, అలాంటి స్థితిలో ఉండిపోవడం మంచిదేనా, గురువుగారూ?

**గురువుగారు :** అవును. అలా ఉండటం చాలా మంచిది.

**భక్తుడు :** ఎందుకంటే అదే సత్యం కనుకనా?

**గురువుగారు :** అవును అదే సత్యం. **సత్యంలో ఉండటం కంటే ఉన్నతమైన స్థితి ఏముంటుంది?**

**భక్తుడు :** గురువుగారూ! మేము మా గతం, భావోద్వేగాలు, పరిస్థితులు ఇలా ఎన్నో బంధనాలకు లోబడి ఉండటం వలన మా ఎంపిక నిర్బంధంగా మారుతుంది అనడం సమంజసమేనా? మేము బంధనాల నుండి స్వేచ్ఛను సాధిస్తే అప్పుడక్కడ ఎంపిక చేసుకోవడానికి పూర్తి స్వాతంత్ర్యం ఉంటుందా?

**గురువుగారు :** నిజమే. మీరు దానిని **బంధనాలు, స్వేచ్ఛ** అంటున్నారు. నేను దానికి **అసహాయత, సామర్థ్యం** అనే పదాలను వాడతాను. తప్పనిసరై ఎంపిక చేసుకోవాల్సి వచ్చిన తక్షణం మనకు మన అసహాయత అనుభవమవుతుంది, అది బంధనాలకు లోబడి ఉండటం వంటిది కాదు. మనం ఎంచుకోవాలని ప్రయత్నిస్తాం. కానీ ఎంచుకోలేం. చివరికి ఇక తప్పనిసరిగా ఎంచుకోవాల్సి వచ్చినపుడు



మనం ఒక దానిని ఎంపిక చేసుకుంటాం. అలా ఎంపిక చేసుకున్న తక్షణం మనకు ఒక రకమైన అసంతృప్తి అనుభవమవుతుంది. మనం నిస్సహాయంగా ఎంచుకోవాల్సి రావడం దానికి కారణం. కాబట్టి నిజంగా మనకి కావల్సింది సరిగ్గా ఎంచుకునే సామర్థ్యం. ఎటువంటి 'ఎంపికా లేని ఎరుక' అనే స్థితిలో ఉంటే మనం సరిగ్గా ఎంచుకుంటాం అని చెబుతారు. 'ఎంపిక లేని ఎరుక' అనే స్థితిని ఎందుకు సాధించాలి అంటే సరిగ్గా ఎంపిక చేసుకోవడానికి (గురువుగారు నవ్వుతూ...) అందులోని పరస్పర వైరుధ్యమంతా అదే. అందుకని నిస్సహాయస్థితిని కాకుండా మనం ఎంపిక చేసుకునే సామర్థ్యాన్ని పొందుతాము.

**భక్తుడు :** కాబట్టి మన ఎంపికలు అనేవి మన వాసనలు, అలవాట్ల మీద ఆధారపడి ఉంటాయన్న మాట?

**గురువుగారు :** అవును. మన పాత అలవాట్ల మీద ఆధారపడి ఉంటాయి. మన పాత అలవాట్ల బలం మనల్ని నడిపిస్తూ ఉంటుంది. వాటినే రకరకాల సాంప్రదాయాలలో ప్యాట్రన్స్ అని, వాసనలని, సంస్కారాలని, కర్మలని ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు. మీరు వాటిని ఏమని పిలిచినా సరే అందు విషయం (సారం) ఇదే.

**భక్తుడు :** ఆధ్యాత్మిక మార్గం ఈ వాసనలను, అలవాట్లను తుడిచిపెట్టి (మనల్ని) అహంకారరహితంగా మార్చడానికి ప్రయత్నించదా?

**గురువుగారు : అహంకారం అంటే ఏమిటి? మనం ఇప్పటివరకూ చేసిన పనుల ఫలితమే కదా.** దానినే మనం అహంకారం అంటాము. కాబట్టి కొంతమంది అహంకారాన్ని వదిలిపెట్టండి అంటారు. ఇంకొందరు వాసనలను నాశనం చేయండి అంటారు లేదా ప్యాట్రన్స్ పోగొట్టుకోండి అంటారు. ఇవన్నీ పరిభాషా పదజాలం మాత్రమే. ఆ పదం ఏమైనా సరే, జరగాల్సిన పని మాత్రం ఇదే.

**భక్తుడు :** గురువుగారూ! శ్రీసాయిబాబా, రమణమహర్షి వంటి మహాత్ములకు నిజంగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందా?

**గురువుగారు :** లేదు, వారలా ఎంచుకోవడం ఉండదు. అస్సలు వారికంటూ ఎటువంటి (ఇష్టాయిష్టాలు) ఎంపికలూ ఉండవు. ఎందుకంటే జరుగుతున్నదానితో కలసి అప్పటికప్పుడు అలా సాగిపోతారు. మనం ఎంపిక చేసుకున్నట్లు వాళ్ళు ఎంపిక చేసుకోరు. ముఖ్యంగా వారి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలలో ఎటువంటి ఎంపికలూ ఉండవు.



**భక్తుడు :** వాళ్ళకు ఇష్టాయిష్టాలు లేకపోవడం ఎంపిక చేసుకోకపోవడానికి కారణమా?

**గురువుగారు :** వాళ్ళకు ఇష్టాయిష్టాలు ఉండవు. వారికి ఎటువంటి ఎంపికలూ ఉండవు. వారికి ఎంచుకునేందుకు ఏమీ ఉండదు.

**భక్తుడు :** గురువుగారూ! మహాత్ములు జరుగుతున్నదానితో కలసి "అప్పటికప్పుడు ఆ క్షణంలో అలా సాగిపోతారు" అన్నారు కదా, దాని అర్థం ఏమిటి? ఏదైనా సందర్భంలో ఎంపిక చేసుకోవడానికి ఒకటి కంటే ఎక్కువ అవకాశాలు ఉన్నప్పుడు అప్పటికప్పుడు అలా సాగిపోతారనడంలో అర్థం ఏమిటి?

**గురువుగారు :** ఏదో ఒకదానిని ఎన్నుకోవడం అంటే జరుగుతున్న దానిని మనం ప్రతిఘటిస్తున్నట్లు లెక్క. ఎవరికైతే ఎటువంటి ప్రతిఘటన ఉండదో, ఎవరైతే ప్రతి దానిని సమంగా తీసుకోగలరో వాళ్ళు ఆ క్షణంలో ఏమి జరిగినా దానితోపాటు కలసి సాగిపోతారు.

**భక్తుడు :** ఎప్పుడైతే అప్పటికప్పుడు అలా సాగిపోవడం జరుగుతుందో అక్కడ మన ఎంపికంటూ ఉండదంటారా?

**గురువుగారు :** అవును. ఎప్పుడైతే మనకు ఎంపికంటూ ఉండదో అక్కడ అప్పటికప్పుడు అలా సాగిపోవడం జరుగుతుంది (నవ్వులు). కానీ, మనం అనుకునే ఆ ఎంపికలేని స్థితి నిజంగా అప్పటికప్పుడు సంభవమవుతుందా? మళ్ళీ ప్రశ్నించుకోండి. మనం కొన్ని విషయాలు అప్పటికప్పుడు జరిగాయి అంటాము, కానీ అవి నిజంగా అలాగే జరిగాయా? నేను మీకు సమాధానాలు ఇవ్వడం లేదు. మీరు ఆలోచించేలా చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాను. కేవలం నాది "ప్రయత్నం" మాత్రమే (నవ్వులు)

**భక్తుడు :** గురువుగారూ! సంకల్పం (ఇచ్ఛ) అంటే ఏమిటి?

**గురువుగారు :** మనం ఒక దానిని ఎంపిక చేసుకుంటున్నాం అనే భ్రమను కలిగించేదే 'సంకల్పం' అని నేననుకుంటాను. మనమిలా సంకల్పిస్తూ, సంకల్పిస్తూ, ఆ భ్రమలో భాగం కావడానికి సిద్ధమైతే, అదే మన చివరి సంకల్పమవుతుంది (నవ్వులు...)

**భక్తుడు :** మరి భగవంతుని సంకల్పం అంటే ఏమిటి?

**గురువుగారు :** సరిగ్గా ఎంపిక చేసే సామర్థ్యం లేదా సంకల్పించే సామర్థ్యం – అది భగవంతుడంటే, భగవంతుని సంకల్పం అంటే అదే. "నీ సంకల్పం నెరవేరుగాక" అని అంటే, ఎవరైతే సంకల్పిస్తున్నారో,



ఆ భగవంతునితో ఒక్కటి కావడం. ఆయన సంకల్పంతో ఒక్కటి కావడం. అంటే భగవంతుని సంకల్పంతో ఒక్కటి కాగల సామర్థ్యాన్ని పొందడానికి ప్రయత్నించడం. 'ఎంచుకోవడం' **(Choice)** అనే పదానికి బదులు 'సంకల్పం' **(Will)** అనే పదాన్ని వాడారు. ఇంగ్లీషులో ఈ రెండింటికీ అర్థం ఒక్కటే. భగవంతునికి మాత్రమే ఎంపిక చేసే సామర్థ్యం ఉంది అని వారంటున్నారు. మీకు ఆ సామర్థ్యం లేదు! కాబట్టి అలా పరిపూర్ణంగా సంకల్పించడాన్ని సాధించడానికి ప్రయత్నించండి. "పరలోకంలోని తండ్రి వలెనే మీరు పరిపూర్ణులు కండి" అని బైబిల్ చెబుతుంది. అదీ అందులోని సందేశం.

మీరు భగవంతుని సంకల్పానికి కట్టుబడి ఉన్నట్లుగా అనిపిస్తుంది. కానీ అలా కట్టుబడి ఉండరు. కట్టుబడి ఉండటం అంటే మీరు భగవంతుని సంకల్పంతో ఒక్కటి కావడం లాంటిది – మీ సంకల్పం, ఆయన సంకల్పం ఇలా రెండు లేకుండా, రెండూ ఒక్కటిగా మారుతాయి. అప్పుడు మీరు పరలోకంలోని తండ్రి అంతటి పరిపూర్ణులవుతారు. వాళ్ళు పరిపూర్ణత్వం, అపరిపూర్ణత్వం అనే పదాలలో చెప్పారు. నేను అసహాయత, సామర్థ్యం, శక్తి అనే పదాలలో చెప్పాను, ఇంకొకరు మరో రకంగా స్వేచ్ఛ, కట్టుబాట్లు అనవచ్చు. ప్రాథమికంగా అందరూ ఒకే విషయాన్ని గురించే చెబుతున్నారు.

**భక్తుడు :** గురువుగారూ! మనకు ఎంపిక చేసుకునే అవకాశమే లేకపోతే, మన జీవితాల మీద మనకు అదుపు లేదనే కదా?

**గురువుగారు :** అదో అంతుబట్టని విషయం (మిస్టరీ). ఒక్కసారి మీకు ఎంపిక చేసుకునే అవకాశం లేదని తెలిసాక అది మిమ్మల్ని చాలా బాధకు గురిచేస్తుంది. ఎందుకంటే మీరు ఎంపిక చేసుకునే అవకాశాలు ఉండటాన్ని ఇష్టపడతారు. మీరు ఎంపిక చేసుకోవాలని కోరుకుంటారు. ఒకవేళ నేను మీకు ఎంపిక చేసుకునేందుకు అవకాశాలు లేవని చెప్పాననుకోండి. అది ఒక దండనలా అనిపిస్తుంది. మీరేదో స్వేచ్ఛను కోల్పోయినట్లు, నిస్సహాయులుగా మారినట్లు అనిపిస్తుంది. "మన చేతులలో ఏమీ లేదు, ఇది ఎంతటి విచారకరమైన పరిస్థితి" అనిపిస్తుంది. కానీ దానిని మరో కోణంలో చూసినట్లయితే మీరు దానిని ఇష్టపడతారు. మీరు **ఎప్పుడైతే ఆ స్థితిని ఇష్టపడటం మొదలు పెడతారో అప్పుడు క్షణమాత్రంగా ఉన్న ఆ పరిపూర్ణత్వస్థితి మీకు స్పష్టంగా గోచరమవుతుంది.**

కొంతమంది అంతా ప్రారబ్ధకర్మ, మీరు చెయ్యగలిగింది ఏమీ లేదు, ప్రతిక్షణమూ – మీరలా



కదిలినా, కూర్చొన్నా, ఊపిరి తీసుకుంటున్నా, తీసుకోకపోయినా ఇలా ప్రతి విషయం ముందే నిర్ణయమైపోయి ఉంటుంది అంటారు. కానీ అది మీరనుకునేలా మన చేతుల్లో లేకుండా ఉండటమో లేక ముందే నిర్ణయమైపోవడంలానో ఉండదు. అది మనం అస్సలు మార్చలేనటువంటి, మన చేతుల్లో ఏమీ లేనటువంటి స్థితి కాదు. కొంతవరకు మీరు దానిని మార్చుకోవచ్చు. అది పూర్తిగా ముందే నిర్ణయించబడి ఉండదు. (గురువుగారు ఒక పెన్నును పై నుండి క్రింద వేసి మధ్యలోనే దానిని పట్టుకున్నారు) ఈ పెన్ను క్రింద పడటం అనేది ముందు నిర్ణయమైపోవడం వంటిది, అది క్రింద పడే వేగం దాని బరువుమీద, పొడవు మీద, గాలి సాంద్రతమీద ఆధారపడి ఉంటుంది. ఇవన్నీ కలసి అది ఎంత వేగంగా క్రిందపడాలో నిర్ణయిస్తాయి. కానీ నేను దానిని మధ్యలోనే పట్టుకుంటే ముందుగా నిర్ణయమైపోవడమనేది ఎక్కడుంది? మనకు ఈ అవకాశమే లేకపోతే అప్పుడు ఆధ్యాత్మికత, సద్గురువు, ముక్తి, మోక్షం మొదలైన వాటికి అర్థమే లేదు. మీరంతా పొందడానికి ప్రయత్నిస్తున్న ఆ స్వేచ్ఛ ఏమిటి? మీరు ముందుగా నిర్ణయించబడిన విధివ్రాత నుండి స్వేచ్ఛను పొందాలనుకుంటున్నారు. మీరు దీనిని అంగీకరించకపోతే, మీరు పొందే ఆ స్వేచ్ఛ కూడా మీ విధివ్రాతలో భాగమైతే అది నిజంగా ముక్తిని పొందడమవుతుందా? అదృష్టమా, అనుగ్రహమా? విధివ్రాతా లేక మన సంకల్పమా? – ఇవి చాలా పెద్ద ప్రశ్నలు. వీటి మీద పుస్తకాలకు పుస్తకాలు వ్రాసారు కదా? (గురువుగారు నవ్వుతూ...) కానీ ఈ మీమాంస మనల్ని ఎక్కడికీ తీసుకెళ్లదు. ఆలోచించి చూడండి. మీకు నిజంగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందా? మిమ్మల్ని (ఏదైనా విషయాన్ని గురించి) ఆలోచించేటట్లు చేసేది ఏమిటి? (ఏదైనా విషయాన్ని) మీ అనుభవంలోనికి తీసుకువచ్చేది ఏమిటి? మీకు ఎంపిక చేసుకునే అవకాశం ఉంటే మీరు ఆనందంగా ఉంటారా? మన ఎంపికంటూ లేని స్థితి అంటే ఏమిటి? ఆ స్థితంటే మనకు ఎందుకంత విచారం? వీటి గురించి ఆలోచించండి. అది మీరనుకునే ఎంచుకునే అవకాశం లేని స్థితి వంటిది కాదు. దానిని గురించి మాటల్లో చెప్పడానికి పదాలు లేవు. అదీ అసలు సమస్య.

**భక్తుడు :** గురువుగారూ! ఎవరైనా నిజంగా ఏదీ మన చేతుల్లో లేదనే విషయాన్ని అంగీకరించినపుడు దానితోపాటు వారికి గొప్ప భద్రతాభావం కలగాలి కదా. ఎందుకంటే జరిగేవి మన ఇచ్ఛానుసారం జరగకపోతే మరెవరి ఇచ్ఛానుసారమో జరుగుతూ ఉండాలి. ఆ 'మరొకరో' లేదా 'మరొకటో' నా జీవితం పట్ల జాగ్రత్త వహిస్తుంటే ఇక ఆందోళనపడాల్సిన అవసరం ఏముంది? నా ఉద్దేశ్యం



ఏమిటంటే ఎవరైనా మన చేతుల్లో ఏమీ లేదని అంగీకరించే స్థితిలో ఉంటే వారి భద్రతాభావం చాలా ఎక్కువ కావాలి.

**గురువుగారు :** అవును, సరిగ్గా ఇక్కడే బాబా అవసరమవుతారు. బాబా మీకు ఆ భద్రతాభావాన్ని ఇస్తారు. దానివల్ల మీరు మన ఎంపికే లేని ఆ స్థితిని గురించి ఎక్కువగా తెలుసుకుంటారు, దానిని ఆస్వాదిస్తారు. మనకోసం ఎంపిక చేసే బాధ్యతను బాబాకు అప్పగించి, "నేను ఆ బాధ్యతను బాబాకు అప్పగించాను, నా జీవితాన్ని ఆయన నడిపిస్తారు. నా కోసం నిర్ణయాలు బాబా తీసుకుంటారు" అని భావిస్తారు. కానీ నిజానికి మీరు ఎంపిక చేసే బాధ్యతను ఆయనకు అప్పగించడం లేదు. కానీ అది అలా అనిపిస్తుంది.

అదే మీకు భద్రతాభావాన్నిచ్చి మీరు మరింత ముందుకెళ్ళేలా చేస్తుంది. లేకపోతే మీరు ముందుకు వెళ్ళలేరు. ఎందుకంటే అది మీరు కూర్చొని ఉన్న కొమ్మను మీరే నరుక్కోవడంలా ఉంటుంది. దానివల్ల మీరు క్రిందపడతారు. కాబట్టి మీరు ఆ పని చెయ్యరు. ఇక్కడే సద్గురువు పాత్ర ముఖ్యమవుతుంది. సద్గురువు వలన మీ పని సులువవుతుంది. కానీ కొంతమంది దీని గురించి సానుకూలధోరణిలో ఆలోచించకుండా తన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కోల్పోయామనుకుంటారు. వారి ఎంపికలన్నీ పోయాయనుకుంటారు. వారికి తామేదో బంధనాలలో చిక్కుకుని దాదాపు బానిసలుగా మారినట్లు అనిపిస్తుంది. కానీ అది నిజం కాదు. వారలా అనుకుంటున్నారంటే వారు అందులోని అందాన్ని చూడలేకపోతున్నారు. మీరు చాలా మంచి విషయాన్ని ప్రస్తావించారు – **మనల్ని ప్రేమిస్తూ, మనకన్నా మంచిగా నిర్ణయాలు తీసుకునే సద్గురువుకు మన కోసం నిర్ణయాలు తీసుకునే బాధ్యతను అప్పగించాక మనం భద్రతాభావాన్ని, ఆనందాన్ని అనుభవిస్తాము.**

ఎప్పుడైతే మీరు నిజంగా ఎంపిక చేసుకోవడానికి వేరే అవకాశం లేదనుకుంటారో – అప్పుడు జరుగుతున్నది మీకు నచ్చినా, నచ్చకపోయినా మీకు అర్థమైనా, కాకపోయినా, అసలు ఏమి జరుగుతుందో మీకు తెలియకపోయినా, ఇదంతా ఎక్కడ ముగుస్తుందో తెలియకపోయినా (నవ్వులు) ఏమీ పట్టించుకోరు. ఎందుకంటే మీకు ఆ భద్రతాభావం ఉంది. **నిజమైనమార్గం** అప్పుడు మొదలవుతుంది. మీరు నిజమైన ప్రేమను అనుభవించడం ప్రారంభిస్తారు. ప్రేమ యొక్క అనుభవం అలా ఉంటుంది.

**భక్తుడు :** గురువుగారూ! మనం మన అసహాయతను అంగీకరించి, మనకు సాయం అందుతుందని



కూడా తెలుసుకున్నాము అనుకుందాం - ఇక మేము చేసేది ఏమిటి? ఇలాంటి పరిస్థితులలో "సరే, జరిగేది ఎలాగూ నేను కోరుకున్నది కాదు" అనే ఒక రకమైన నిర్లిప్తత చోటు చేసుకుంటుంది కదా?

**గురువుగారు :** చాలా మంది విషయంలో ఏం జరుగుతుందంటే మనం తీసుకునే నిర్ణయాలపట్ల (మన ఎంపికపట్ల) మనకు నమ్మకం ఉండదు. మనమెప్పుడూ డోలాయమానమైన స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఉంటాము. ఇది మంచిదా లేక చెడ్డదా? ఇది సరైనదా లేక సరైనది కాదా? మనకు నిజంగా ప్రయోజనకరంగా ఉంటుందా లేదా... ఇలా డైలమాలో ఉంటాం. కానీ మనం ఒక్కసారి సద్గురువు చెయ్యి పట్టుకున్నాక మనం భయం లేకుండా నిర్ణయాలు తీసుకుంటాం. కాబట్టి మనం తీసుకునే నిర్ణయాలను తీసుకోకుండా ఆగడం ఉండదు. మనం తీసుకున్న నిర్ణయాలను ఆనందంగా ఆస్వాదిస్తాం. అంతకుముందు మనం తీసుకునే నిర్ణయం యొక్క భారాన్నంతా మనమే మోస్తూ ఉంటాం కాబట్టి అలా ఆస్వాదించలేము. సద్గురుదరికి చేరుకున్నాక ఇది పూర్తిగా భిన్నమైన విషయంగా మారిపోతుంది.

**భక్తుడు :** అంటే మనం తేలికైన హృదయంతో, ఒక రకమైన అభద్రతాభావంతో నిర్ణయాలు తీసుకుంటామా?

**గురువుగారు :** ఎక్కువ భద్రతాభావం ఉంటుంది. నిజమే, మీరు దానిని తేలికైన హృదయం అంటానంటే అనవచ్చు. కానీ అది కేవలం తేలికైన హృదయమే కాదు. అది తేలికపడిన హృదయం. భారంలేని హృదయం. నిర్ణయం తీసుకోవడం అనే భారమంతా తీసివేయడం వలన హృదయం తేలికపడుతుంది.

**భక్తుడు :** గురువుగారూ! ఈ మొత్తం క్రమంలో మన ప్రయత్నానికి తావెక్కడుంది?

**గురువుగారు :** ఆ భద్రతాభావాన్ని ఇంకా ఇంకా పెంచుకోవడానికి, ఇంకా ఇంకా అనుభవంలోకి తెచ్చుకోవడానికి, స్వేచ్ఛాయుతమైన జీవితం గడపడానికి ప్రయత్నించడం - **స్వేచ్ఛగా జీవించాలి, అజాగ్రత్తగా కాదు - దానికోసమే మన ప్రయత్నమంతా.**

**భక్తుడు :** కాబట్టి చివరికి మొత్తం శరణాగతి వద్దకు వస్తుంది - శరణాగతి కోసం గురువు వద్దకు వెళ్ళడమేగా?

**గురువుగారు :** మీరు శరణు పొందడానికి గురువు దగ్గరకు వెళ్ళడం జరగదు. ఆయన దగ్గరకు వెళ్తే జరిగేది శరణాగతి. శరణాగతిని పొందడం కూడా మీ చేతుల్లో ఉండదు. (గురువు దగ్గర) మీరు



అనుభవించే ఆ స్థితినే 'శరణాగతి' అంటారు. సాధారణంగా ఏం జరుగుతుందంటే అందరూ శరణాగతిని ఒక సాధనగా, ఆత్మసాక్షాత్కారానికి ఒక మార్గంగా చూస్తారు. అది మీరు ఎంచుకునే సాధనం కాదు. సద్గురువు మనలో ఆ ప్రేమను కలిగించాలి. **ఒక్కసారి మీరు ఆ ప్రేమను అనుభవించడం మొదలుపెట్టాక, శరణాగతి తప్పనిసరి అవుతుంది. అక్కడ మీకు మరో అవకాశం ఉండదు. అక్కడ మరో మార్గం ఉండదు. ఆ ప్రేమ నెమ్మదిగా మన ఇష్టాఇష్టాలను (ఎంపికలను) వదులుకునేలా చేస్తుంది. మన ఎంపికంటూ లేకుండా పోవాలి అనేది లక్ష్యం కాదు. అది ఏదో ఒక దాని ఫలితం, పర్యవసానం. మనం సద్గురువును అంతగా ప్రేమిస్తాం కాబట్టి మన ఇష్టాయిష్టాలు ప్రాధాన్యతను కోల్పోతాయి. మనం ప్రేమించే వ్యక్తి దేనినైతే ప్రేమిస్తారో మనమూ దానినే ప్రేమిస్తాం. మనం ఆయన నిర్ణయంలో భాగమైపోతాము. మనల్ని మనం కోల్పోతాం. మన వ్యక్తిత్వాన్ని కోల్పోయి ఓ గొప్ప ప్రేమలో కలసిపోతాము. ఎప్పుడైతే మీకిక వేరే మార్గం లేదని, మీకు గమ్యం చేరడానికి వేరే అవకాశం లేదని తెలుసుకుంటారో అప్పుడు మీరు శరణు పొందుతారు.** శరణాగతి అంటే అదే. – *శరశ్చంద్రికలు **2015** జూలై*

## బాబా ఉంటే చాలు - వేరేల ముక్తి మోక్షాలు

...... "బిచ్చమేసే మహరాజు బాబాయే అయినపుడు ఆయన ముందు జోలి తగిలించుకుని భిక్షాపాత్రను చేతపట్టుకోటానికి సిగ్గుపడాల్సిన పనే లేదు. ఆయన ముందు నేను బిచ్చగాడినే. ఆయన వేసింది ఏదైనా నాకిష్టమే. ఆయన (బాబా) తిని రాల్చిన ఎంగిలి మెతుకైనా నాకు పెన్నిధితో సమానమే".... అన్న మాటలు గురుదేవులు సముద్రమంత గంభీరంగాను, ఆకాశమంత శాంతంగాను, మేఘజలమంత నిర్మలంగాను అనేసరికి నా వళ్ళు అణువణువునా పులకరించింది, పరవశించింది., రోమాంచితమైంది. తెలియకుండానే కళ్ళవెంట ఆనందభాష్పాలు రాలినవి. ఎందుకు? కారణం తెలుసా? అంటే తెలియదు.

**శరద్బాబూజీ మహోన్నతమైన స్థాయిలో, ఆధ్యాత్మికతయనే మధుర వృక్షానికి పండిన మధురాతి మధురఫలం.** ఎందరో హృదయాలలో వారి రూపాన్ని పదిలంగా భద్రపరచుకున్నారు. దైవంలా ఆరాధిస్తున్నారు. అలాంటి మహానుభావుడు, మహోన్నతుడు, మహామహోపాధ్యాయుడు, శరద్బాబుగారు, అలాంటి మాననీయుడు ఆర్తిగా, ఆనందంగా బాబా ముందు నేను బిచ్చగాడినే



అన్న మాటలు నాభినుంచి వచ్చినవేగాని, నాల్కకొస నుంచి వచ్చినవి కావు. నాకు గత సన్నివేశాలు కొన్ని గుర్తుకు వచ్చాయి. గురుదేవులు బాబా ముందు మోకరిల్లే విధానము, నమస్కరించేతీరు, సాష్టాంగపడు విధానము, బాబా వంక చూచే విధాయకము, గమనిస్తే పరాకాష్టకు చెందిన భక్తశిఖామణులైన కబీరు, తుకారం, జ్ఞానదేవులు మొ॥ వారంతా జ్ఞప్తికి రాకమానరు. దాస, దాస, దాస, దాసానుదాసులమనే వైష్ణవస్వాములు, ఆళ్వార్లు గుర్తుకు వస్తారు. నేను 'వేంకటగిరి' ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రోపన్యాసకునిగా పనిచేస్తున్న రోజుల్లో పాఠ్యాంశంలో ఈ పద్యానికి అర్థం చెప్పి, భావాన్ని విశదపరిచినాను. నాకెందుకో తృప్తి కలగలేదు.

అసంపూర్ణమైన భావమే నా నుండి వచ్చిందా? అని అనిపించింది. మధురానగరాన్ని చూడవచ్చిన బలరామకృష్ణులు మాలాకారుడైన సుదాముని ఇంటికెళ్లినారు. తన ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణుడు సుదాముని వరము కోరుకోమనగా 1. నీ పాదసేవ 2. నీ పాదములను సేవించువారితో స్నేహము 3. భూతదయయును ప్రసాదించమనినాడు. ఈ సందర్భంగా నాకు కలిగిన అనుమానమేమంటే దైవము సాక్షాత్కరించినపుడు, అనంతైశ్వర్యమునో, త్రిలోకాధిపత్యమో, లేదంటే మోక్షమునో కోరుకుంటారుగాని పాదసేవ, పాదసేవ చేయువారితో స్నేహము ఇత్యాదులు కోరుతారా? అనే శంక చాలా కాలమువరకు నన్ను వెన్నంటింది. ఎందుకంటే ప్రతివాడు తరచుగా భగవత్సాక్షాత్కారము లభించినపుడు ముక్తి, మోక్షాదులనే అడుగుతారు గదా! ఈ అనుమానం అనుమానంగానే ఉంది. ఎవ్వరినీ అడగలేదు. షిరిడీలో ఒకరోజు మన గురువుగారు వారి ముందు కొందరు బాబా భక్తులు కూర్చుని ఉన్నారు. వారి సందేహాల మూటలను గురువుగారి ముందు విప్పారు. బాబాకు సంబంధించిన విషయాలు గురువుగారు చెప్పేటపుడు చూడాలి. ఉత్సాహం, ఉత్తేజం, ముప్పేటలుగా పెనవేసుకుని ఉంటాయి. మోక్షం విషయంగా సాగుతుంది విషయం.

**భక్తుడు :** బాబా మోక్షాన్ని గురించి ఏం చెప్పారు?

**గురువుగారు :** మోక్షము – ముక్తి మొ॥ మాటలను బాబా ఎన్నడూ అనలేదు. మసీదులో వారెన్నడూ ఆధ్యాత్మికమైన ఉపన్యాసములు చెప్పలేదు. వేదాంత విషయాలు, సుదీర్ఘ ప్రసంగాలు, ఆత్మ, జీవాత్మ, పరమాత్మ వంటి మాటలను వేదాంత విషయాలుగా బాబా చెప్పి ఉండలేదు.

**భక్తుడు :** మరేం చెప్పారు.



**గురువుగారు :** బాబా లీలలను పరిశీలించండి. మీకు స్పష్టంగా అర్థం కాగలదు. బాబా ఎక్కువగా మాటలు చెప్పేవారు కాదు. పది మాటలు మాట్లాడితే ఒక మాటతో సమాధానం చెప్పేవారు. ఎవ్వరితోను అధికంగా మాట్లాడలేదు. వేదాంత పరిభాషగా బాబా చెప్పలేదు. పనిచేయి, భగవన్నామ ముచ్చరించు, సద్గ్రంథాలు చదువు, గురువుకు పగ్గాలప్పగించు, చింతకు తావేలేదు, నాపై భారమేయుడు. మిమ్ములను చివరికంటా గమ్యం చేరుస్తాను. ఇలాంటివి. బాబా ఎన్నడూ ముక్కు మూసుకుని తపస్సు చెయ్యమనిగాని, భార్యాపుత్రులు-బంధాలు అనిగాని అనలేదు. అన్నీ వాడే చేస్తే ఇక భగవంతుడు చేసేది ఏంటట? ఉపాసనీ బాబా శిరిడీకి వచ్చాడు. రొట్టె, కూరముక్కలు తింటూ, హాయిగా ఖండోబా ఆలయంలో ఉండమన్నారేగాని, నీవు జపతపాలను చేయమని బాబా ఎన్నడూ అనలేదు.

ఆయన మీద భారము వేయగల్గడమే మనం చేయవలసింది. మనలను నిశ్చింతగా ఉండమనినారు. గమ్యాన్ని నేను చేరుస్తాననే బాబా చెప్పారు. ఇతర దేవతా మూర్తులకు బాబాకు ఇక్కడే వ్యత్యాసం కనిపిస్తుంది. అన్ని బంధాలు తెంచుకొని నిరంతరం నన్నే స్మరిస్తూ ఉంటే నీ యోగక్షేమాలకు నేను బాధ్యత వహిస్తానని భగవద్గీత చెబుతుంది. బాబా భక్తుడు చేయవల్సిందేమీ లేదు. బాబా మనకోసం చేసేది అనంతము. ఆనందముగా జీవించాలి. నాకు ముక్తి వద్దు, మోక్షము వద్దు.

**నా ప్రశ్న :** సర్వసాధారణంగా అందరూ ముక్తి, మోక్షము కావాలని అంటారు గదండీ!

**గురువుగారు :** వాళ్ళకు దాని అవసరమేమో తెలియదు. నాకైతే దాంతో పనే లేదు. నాకు జన్మజన్మలకు బాబాతో అనుబంధముండాలి. ఆయన సన్నిధి కావాలి. ఆయన సేవ కావాలి. ఆయన రూపం నిరంతరం నా ఎదుట కనిపించాలి. ఆయన కోసం నా జీవితం గడవాలి.

బాబా కనిపించని జీవితమెందుకండి, నిరంతరం నాకు బాబా కావాలి. బాబాతో అనుబంధముండాలి. బాబాను చూస్తుండగా కలిగే ఆనందం ముక్తి, మోక్షాలలో ఉంటుందా? బాబా కనిపించని ముక్తి, మోక్షాలు నాకు నిజంగా అక్కరలేదు. ఆయన రూపం, ఆయన సన్నిధి నాకు నరకంలో లభించినా, నరకానికి వెళ్ళడానికి గూడా అభ్యంతరం లేదు. ఎంతటి కష్టాన్నైనా బాబాను చూస్తూ ఆనందంగా అనుభవిస్తాను. ఆయన సేవే నాకు ముఖ్యం. ఎన్ని జన్మలున్నాయో నాకు తెలియదు. బాబాతో అనుబంధముండాలి. బాబాను చూడాలి, బాబా అన్న ఆనందాన్ని ప్రతి జన్మలో అనుభవించాలి. మోక్షం వలన జన్మ లభిస్తుందా? బాబా సేవ లభిస్తుందా? బాబా సేవ లభించని



మోక్షస్థితి అటువంటి జన్మ నాకు వద్దు" అన్న మాటలు నాకు సమన్వయమైనవి నా పద్యానికి.

నిజమేగదా! నిరంతరం తన ఆరాధ్య దైవానికి ఎదురెదురుగా సంచరిస్తూ, ఆయన సన్నిధిలో నివసిస్తూ ఆయన పాదసేవను గావిస్తూ, ఆయనను గురించిన లీలలను వినాలంటే ఆయన సేవకులే గదా–వారి గుణగణాలను గానం చేయగల్గినది. గురుదేవా! వందనమయ్యా! బాబాపై మీకున్న ప్రేమ అపారము, అనంతము. నరకంలో గూడా ఆయన రూపం ఉంటే ఎలాంటి కష్టాన్నైనా అనుభవిస్తాననే మాటలు వినేసరికి ఒడలు జలదరించాయి. గురువుగారి భక్తి, ప్రేమ, శ్రద్ధ, శరణాగతి సామాన్యమైనవి కావు. అలాంటివారి పాదాలను తాకినాచాలు. ఎన్నో జీవితాలు ఆనందదాయకమవుతాయనిపించింది. పూర్వం "కుక్కటముని" అనువారున్నారు. సకల పాపాలను పోగొట్టగల గంగా, కావేరీలు తమ పాపాలను ప్రక్షాళనం చేసుకోవడానికి ఆ కుక్కట మునీశ్వరుని సన్నిధికి వచ్చి, ఆ మహనీయుని పాదజలాన్ని తమ తమ శిరములపై చల్లుకున్నంత మాత్రాన వారి పాపాలు తొలగి మలిన దేహమంతరించి పోయేది. ఆ కుక్కట మునీశ్వరునకు అంతటి మహిమ ఎక్కడిది? తన గురువును శ్రద్ధ, సబూరీలతో సేవించి, శరణాగతి చెంది ఉండటమే కారణం. బాబా కూడా ఒకానొక సందర్భములో "నా ఈ స్థితికి మూలము నా గురువే" అని చెప్పినారు. తన గురువును బాబా ఎలా సేవించినది చెప్పి ఉన్నారు. ఈనాడు అలా బాబాను మన గురువుగారు సేవిస్తున్నారనిపించింది. మరో సందర్భములో తిరువణ్ణామలైలో వారితో ఇలా అన్నాను. సార్ ఈనాడు బాబా ఒకప్పుడు వారిచ్చిన స్టేట్‌మెంట్ మార్చుకోవాలేమోననిపిస్తుంది అని అన్నాను. ఏమిటా స్టేట్‌మెంట్ అని అడిగారు. ఉద్వేగతను, వాస్తవమును వివరించు అంశమును, వారు వినిపించిన భాగవతోత్తముల కథలను వచ్చే సంచికలో చూడగలము. **– డా॥ జి. సాయివరప్రసాదరావు, రేపల్లె.**

**మనం చేసే జపము, సాధన, ఆత్మవిచారణ చూసే మనలను సద్గురువు అనుగ్రహిస్తున్నారు అనుకోవడం పొరపాటు. బాబా అనుగ్రహం పొందడానికి ఏ విధమైన నిబంధనలు లేవు. ఆయనకు నీతో ఉన్న బంధము వలన, తండ్రి బిడ్డను ప్రేమించినట్లు ప్రేమిస్తారు. తండ్రి బిడ్డలో ఉండే యోగ్యత చూసి ప్రేమిస్తాడా? బిడ్డ యొక్క అర్హత ఏమిటి? ఆ తండ్రికి జన్మించడమే. అంతే. అదే ఏకైక బంధం. ఆయన బిడ్డను ప్రేమిస్తారంతే. అలాగే సద్గురువు కూడా తండ్రిలాగా మనల్ని ప్రేమిస్తూనే ఉంటారు. మనమందరము ఆయన బిడ్డలం.**

**– శ్రీబాబూజీ**



# గురుకృపాలహరి

**... ఉద్యయేన హి సిద్యంతి కార్యాణి న మనోరథైః**
**న హి సుప్తస్య సింహస్య ప్రవిశన్తి ముఖేమృగాః...**

శక్తి సామర్థ్యాలను పరిపూర్ణంగా వినియోగించుకునే వారి మనోభీష్టాలు తప్పక నెరవేరుతాయి. సింహమైనా సరే, తాను ఉదర పోషణార్థం అడవిలో వేటాడకపోతే ఆహారం నోటికందుతుందా అంటుంది హితోపదేశం. బహుముఖ గుణనిధానమైన గురుచంద్రుడు తమ జీవితాన్ని తరతరాలకు ఆదర్శవంతంగా, అనుసరణీయంగా, లక్ష్యసాధనకు మార్గదర్శకంగా మలచుకుంటూ సాగించాడు. జగద్గురువుల జీవితాలు మానవమస్తిష్కాలకు అందే పూలబాటలు కాదు. వారి గురుపరంపరను మరింత దేదీప్యమానంగా శోభింపచేసే క్రమంలో ముళ్ళబాటలను కూడా మల్లెబాటలుగానే స్వీకరించారు. సదా దైవంతో సహజీవనం చేసే గురుస్వరూపునకు వలసిన మరో లక్ష్యం ఏముంటుంది? అయితే మానవదేహం ధరించి వచ్చిన దైవస్వరూపులు – పరిపూర్ణత్వానికి సాకారంగా రాబోయే తరాలకు దిశానిర్దేశం చేస్తారు వారి జీవిత గమనంతో. వారి దేహపోషణకు, వారి జీవిత సౌఖ్యానికి ఎక్కడా ప్రాముఖ్యత కనపబడదు. వారు విశ్రమించే క్షణాలు అరుదు – మనిషి దైవస్వరూపుడని చెప్పడానికి వారు చేసే కృషి ఎన్నటికీ మారదు. పరమాచార్య స్వామివారి జీవితం సాధకుల లక్ష్యశుద్ధికి, లక్ష్యసిద్ధికి ఒక సమగ్ర సాఫల్యపథం. అవాంతరాలెన్ని ఎదురైనా తలదించక మొక్కవోని పట్టుదలతో ఎలా ముందుకుసాగి లక్ష్యం చేరాలో తెలియచెప్పే సూటిబాణం వారి జీవిత ప్రస్థానం. బీహార్ రాష్ట్రం నుండి పశ్చిమబెంగాల్ రాజధాని కలకత్తాకు సాగిన వారి పవిత్ర చరణయాత్ర లక్ష్యసాధనకు ఒక అర్థంగా నిలుస్తుంది. స్వామివారి పదాల వెంట మనమూ పరుగులిడదామా?

బీహార్ రాష్ట్రంలోని మరో ప్రముఖక్షేత్రం దేవ్‌ఘర్ – 'భగవంతుని ఆవాసము'ను సందర్శించారు స్వామి. వైద్యనాథన్‌గా కొలువబడే ఆ ఈశ్వరుని ఆలయాన్ని దర్శించినపుడు అక్కడి ఈశ్వరలింగం ముందు చాలాసేపు స్వామి ధ్యాననిమగ్నులై కూర్చొండిపోయారు. అక్కడి అమ్మవారు శ్రీగిరిజాదేవిని సందర్శించి ఆలయమూర్తులందరికీ నూతన వస్త్రాలను సమర్పించారు. అక్కడి 'స్వర్గాశ్రమం'లోని బాలానందబ్రహ్మచారి విన్నపం మేరకు స్వామి ఆ ఆశ్రమాన్ని సందర్శించి పాదపూజలు స్వీకరించారు. ఆ సమయంలో గౌరీశంకర రుద్రాక్షమాలను సమర్పించి, అర్ఘ్యపాద్యములను సమర్పించి,

పరమాచార్యులను పూజించిన తీరును చూసిన స్థానికులు సంతోష సంద్రంలో ఓలలాడారు. అదే సమయంలో స్వామివారు తమ చాతుర్మాస్యాన్ని 250 మైళ్ళ దూరంలో ఉన్న కలకత్తా నగరంలో చేయాలని సంకల్పించారు. కేవలం ఇరవై మూడు రోజులు మాత్రమే ఉంది–చాతుర్మాస్యం ప్రారంభమవడానికి. ప్రతీరోజు పదిహేను మైళ్ళ నడక సాగించాలని సంకల్పించి అందుకు తగ్గ ఏర్పాట్లు జరిగాయి. స్వామివారు రోజూ ఉదయకాలంలో చంద్రమౌళీశ్వరపూజ – సూర్యుడు అస్తమించడం ప్రారంభమవగానే సాగే నడక. ఇలా ఏ ఒక్కరోజూ ఒక్క ప్రాంతానికి పరిమితం కాలేదు స్వామివారు, వారి పరివారం. సంకల్పమే వారిదయితే ఇక సాధ్యాసాధ్యాల ప్రశ్నెక్కడిది? 1935వ సం॥ జూలై15వ తేదీన స్వామివారు తమ పవిత్రచరణాలతో కలకత్తా నగరాన్ని పావనం చేసారు.



భిన్న రాష్ట్రాల ప్రముఖులు నివసించే కలకత్తా మహానగరంలో వారితో ఏర్పాటు చేయబడ్డ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో స్వామివారిని ఘనంగా ఆహ్వానించారు కలకత్తావాసులు. పల్లకీలో స్వామివారిని తోడ్కొని కలకత్తా ప్రధాన వీధులలో సాగిన ఆ ఉత్సవం కన్నుల పండుగగా సాగింది. స్వామివారిని దర్శించి, తరించడానికి బాటకిరువైపులా వేచి చూసిన భక్తజనులకు అది ఒక నేత్రోత్సవ పర్వమయింది. వేచి చూసిన ప్రతీవారికి దర్శనం లభించేటట్లు పోలీసులు ఎంతో సహకరించారు. వర్ణాశ్రమ స్వరాజ్యసంఘ ప్రాంగణంలో స్వామివారి విడిది ఏర్పాటు చేయబడింది. విద్యాధికులు, పండితులు, అధికారులు, ఎందరెందరో స్వామివారికి స్వాగతం పలికారు.

ఆరోజు రాత్రి స్వామివారు కాళీఘాట్ ఆదిగంగ ప్రాంగణానికి దగ్గరలోని నట్టుకొట్టి నాగరాదర్ విడిది చేరారు. ఆ సంవత్సరం వ్యాసపూర్ణిమ ఆ ప్రాంగణంలోనే జరిగింది. గంగాస్నానమాచరించి స్వామివారు చాలా సమయం కృష్ణభగవానుని విగ్రహానికి పూజాదికాలు నిర్వహిస్తూ ఉండిపోయారు. వ్యాసశంకరులను కూడా పూజించారు. దేశం నాలుగు చెరగుల నుండి వచ్చిన తీర్థ ప్రసాదాలను, ఎన్నో రాజకుటుంబాల నుండి వచ్చిన దూతల ద్వారా స్వామివారికి చేయవలసిన మర్యాదలు, సభక్తిపూర్వక సమర్పణలను నివేదించడం జరిగింది. పూజానంతరం బ్రహ్మసూత్రాలపై జరిగిన చర్చలో స్వామివారు పాల్గొని మార్గం చూపారు. మర్యాదలపట్ల, మన్ననల పట్ల వారికి ఉండే భావం తామరాకు మీద నీటిబొట్టులా ఉండేది. పీఠ మర్యాదకోసమేగాని, వారి మనసంతా ఆర్తజనుల ఆవేదనలను వినడంలోను, సాధకులకు మార్గనిర్దేశనం చేయడంలోను, జిజ్ఞాసవుల సందేహాలను



తీర్చడంలోనూ ఉండేది. వారికున్న ప్రీతి విషయవాంఛలలో ఇసుమంత కూడా కనబడేది కాదు.

శ్రీరామకృష్ణుల మాతృస్వరూపిణి అయిన 'కాళీ' మందిరాన్ని కూడా పరమాచార్యస్వామి సందర్శించారు. ఆంగ్ల, సంస్కృత, బెంగాలీ భాషలలో స్వామివారికి స్వాగతపత్రాలు సమర్పించబడ్డాయి. స్వాగతసభలో స్వామివారి విశేష ప్రజ్ఞను, మానవతా కోణాలను, సర్వజ్ఞ పీఠమైన కంచిపీఠాన్ని వారు అధివసించిన తీరును గురుతు చేసుకొని పరవశించారు పురజనులు. శ్రీవారు తమ పవిత్ర చరణాలనిడి దేశంలోని నాస్తికతను పారద్రోలి విశ్వాసము, భక్తిని మానవులలో పాదుకొల్పడానికి చేస్తున్న శ్రమకు-శిరస్సు వంచి నమస్సులర్పించింది స్వాగతసభ. ఈశ్వరునికి, కాళీమాతకు ప్రత్యేక పూజాదికాలు జరుపబడ్డాయి. స్వామివారి విజయయాత్ర నిర్విఘ్నంగా జరిగి మానవాళికి వారి అనుగ్రహాశీస్సులు అపారంగా అందాలని ప్రార్థించారు భక్తజనులు. స్వాగత సత్కారాన్ని సవినయంగా గ్రహిస్తూనే ఆ ప్రస్తుతినంతా ఆదిశంకరుల చరణాలకు అంకితమని తెలియచేసారు స్వామి.

భాగీరథి తీరాన ఉన్న ఐదు శివాలయాల మధ్యభాగంలో స్వామి వారికి ఒక స్వాగత సభ జరిగింది. అక్కడి పండితులకు వేదాధ్యయనము యొక్క ఆవశ్యకతను, వేదవిద్య వ్యాప్తి అవసరాన్ని తెలియచెప్పారు స్వామి. 'మహామహోపాధ్యాయ' బిరుదము పొందిన ప్రథములలో ఒకరైన రత్నభట్టాచార్యగారి ఆధ్వర్యంలో జరిగిన విద్వత్సభలో ఈ విధంగా స్వామివారిని ప్రస్తుతించుకున్నారు.

**"ఆదిశంకరుల పరంపరాగతులై, సాక్షాత్తు శంకరులైన నడయాడే దైవం కంచియతీంద్రులకు నమోవాకాలు. భవసాగరాన్ని దాటేక్రమంలో, ధర్మాన్ని ఎలా ఆచరించాలో, ఎలా సవ్యమార్గంలో పయనించాలో మీ అనుగ్రహభాషణంతో మా కలకత్తా వాసులకు దారిచూపండి, మా అందరిలో ధర్మాచరణ పట్ల స్ఫూర్తిని నింపండి. మా సుకృతం వల్ల మీ చరణ స్పర్శ ఈ నగరానికి లభించింది. మైదానాలుగా ఉండి, నూతనంగా నిర్మితమైన కలకత్తా నగరానికి మీ పదస్పర్శ ఎంతో శక్తినిస్తుంది. సులభంగా పయనించే రవాణా మార్గాలున్నా, మీరు పాదచారులై మీ పవిత్ర పదస్పర్శను మాకు అందించడం కేవలం ఈశ్వరకృప మాత్రమే. తీర్థ, క్షేత్ర దర్శనం కడు దుర్లభమని, అంతేకాక మీ వంటి సత్పురుషుల సందర్శనం తక్షణ ఫలితాన్నిస్తుందని అంటుంది భాగవతం. మాలోని అజ్ఞానాంధకారాలను పారద్రోలి ధర్మాచరణసక్తులమై మా జీవితాలను ఆనందమయం చేసుకునేందుకు**



**మీ అనుగ్రహభాషణాలే మాకు చుక్కాని. మీ వంటి మహితాత్ములను ఎలా ప్రస్తుతించాలో కూడా తెలియని వారము. ఆనందాశ్రువులతో నా కన్నులు, కమనీయ భావంతో నా కంఠము మూగదై, నా తనువంతా తన్మయమై ఒడలు పులకరించి మూగనవుతున్నాను. సద్ధర్మ స్థాపకులై మమ్ము తరింపచేయ వచ్చిన మీ చరణాలకు సభక్తికంగా అంజలి ఘటిస్తున్నాం".** మహామహోపాధ్యాయులే స్వామివారి కృపను వర్ణించలేక మూగబోయిన సందర్భమది. అట్టి మహితాత్ముల మననం కేవలం **'గురుకృపా'** విశేషమే కదా! 85 వసంతాల పూర్వపు సంఘటనలివి. ఇప్పటికీ **వాడిపోని అనుభవసుమాలే!** నిత్యాచరణకు, సద్గురువు పట్ల వలసిన వినయము, శ్రద్ధా-భక్తులకు దీపస్థంభములే! ఆ సంవత్సరం వసంత నవరాత్రులు కలకత్తా నగరంలో జరిగాయి. జగజ్జనని 'కాళీ'మాతకు ఆలవాలమైన ఆ నగరంలో స్వామి వారి దర్శనభాగ్యమునకు నోచుకున్న పురవాసులు పుణ్యం చేసుకున్నారు. అక్టోబర్ మూడవవారంలో కలకత్తా పట్టణం నుండి పయనమై దామోదర్, రూపనారాయణ్ నదులు దాటి జనార్దన్‌పూర్ మీదుగా కలకత్తా పట్టణానికి నైరుతి దిశలోని మిడ్నాపూర్ చేరారు స్వామి. స్వామివారు జనార్దన్‌పూర్ వస్తారని తెలియగానే మిడ్నాపూర్‌లో స్వామివారిని ఆహ్వానించే నిమిత్తం స్వాగతకమిటీ ఏర్పాటయింది. తీవ్రవాదుల ప్రాబల్యమున్న మిడ్నాపూర్‌లో ఎన్నో సంవత్సరాల నుండి సభలు, సమావేశాలు,ఉత్సవాలపై ఆంక్షలున్నాయి. రాత్రి తొమ్మిది గంటల తర్వాత సంచరించేందుకు వీలు లేదు. స్వాగతకమిటీ ప్రార్ధనను అంగీకరించి స్వామివారు మిడ్నాపూర్ వేంచేయడానికి అనుగ్రహ సమ్మతినొసగారు. ప్రభుత్వం కూడా స్వామివారి రాకకు గౌరవసూచకంగా ఆంక్షలను సడలించింది. పరతంత్రంలో మగ్గుతున్న పురవాసులకు స్వతంత్ర్యం లభించినంత సంబరమయింది స్వామివారి రాక. నగర ప్రముఖుల ఆధ్వర్యంలో మిడ్నాపూర్ అంతా పండుగ వాతావరణం సంతరించుకుని స్వాగతతోరణాలు, మంగళాశాసనాలతో ముస్తాబయింది. నగరంలోని పన్నెండు చోట్ల స్వామివారికి స్వాగతపత్రాలు సమర్పించారు. హిందీలోను, సంస్కృతంలోను స్వామివారు తమ అనుగ్రహభాషణాన్ని చేసిన ఆ క్షణాలలో అక్కడ ప్రజల మనసులలో ధర్మము, భక్తి బలంగా ముద్రించుకుపోయాయి. వేలాదిమంది ప్రజలు బారులుతీరి స్వామివారి దర్శనం చేసుకొని ఊరేగింపుగా స్వామివారి విడిదిని చేరి చంద్రమౌళీశ్వర సేవను చూసి పరవశులయ్యారు. తీర్థ ప్రసాదాల నందించిన స్వామివారి చరణాలకు నమస్సులర్పించారు పురవాసులు.



స్వతంత్ర భారతావని దాస్యశృంఖలాలను చెర విడిపించే ప్రయత్నంలో విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు, లాయర్లు, వైద్యులు ఎందరినో చెరపట్టింది బ్రిటీష్ ప్రభుత్వం. అలా ఖైదీలైన యోధులు స్వామివారి రాకను తెలుసుకొని వారి ఆశీస్సులకై దర్శనం చేసుకుంటామని అక్కడి ఆంగ్ల జైలు అధికారికి అర్జీ పెట్టుకున్నారు. నియమిత సమయంలో వెళ్ళి సాయంత్రం ఆరుగంటలకల్లా తిరిగి వచ్చే షరతుపై ఒప్పుకున్నాడు ఆ అధికారి. పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఖైదీల బృందం స్వామివారున్న విడిది చేరేసరికి సాయంత్రం 5.30 అయింది. నిత్యపూజానంతరం స్వామి విశ్రమించిన సమయమది. స్వామివారి ఏకాంతాన్ని భంగపరచడం ఇష్టం లేని మఠవాసులు వారిని వేచి ఉండమని ప్రార్థించారు. అయితే జైలు షరతులను ఉల్లంఘించినట్లు అవుతుందని వారి భయం. వెనుదిరిగిన ఆ యోధులను స్వామివారు అంతలోనే వెనుకకు పిలిపించి తీర్థ ప్రసాదాలను అభయాశీస్సులను అందించారు. భారతావనికి స్వతంత్ర్యం సిద్ధించాలని, ఈ భూమి శాంతి, ఆనందాలకు ఆలవాలమవ్వాలని దీవించమని వేడుకున్నారు ఆ స్వతంత్ర్య సంగ్రామ యోధులు.

స్వామివారి దర్శనానంతరం సమయానికి జైలు ప్రాంగణం చేరి ఎవ్వరికీ ఇబ్బంది కలిగించకుండా సంతుష్టులయ్యారు వారు. స్వామివారు ఆ దేశభక్తుల త్యాగనిరతికి, దీక్షకు ప్రసన్నులయ్యారు. అక్కడి నుండి పయనమయిన ఆచార్యులు ఖరగ్‌పూర్ రైల్వే టౌన్‌కు చేరారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి అక్కడకు చేరిన ఉద్యోగులు మఠవాసులకు అన్ని ఏర్పాట్లు చేసారు. ఒకవారం మాత్రమే అనుకున్న స్వామివారి విడిది–పీఠ పరివారం అస్వస్థులవడంతో రెండు వారాల పాటు అక్కడే ఉండి పోవలసి వచ్చింది. అక్కడి నుండి టాటానగర్‌కు పయనమయిన విజయయాత్ర అక్కడి అతిశీతల వాతావరణానికి, ప్రయాసతో కూడిన పాదయాత్రకు ఎందరో మఠవాసులు అనారోగ్యానికి గురి కావడంతో సుమారు 45 రోజులు అక్కడే ఉండిపోయారు. దేశ స్టీలు అవసరంలో సింహభాగాన్ని అందించే టాటాస్టీల్ ఫ్యాక్టరీని అక్కడి అధికారుల వినతితో దర్శించి పునీతం గావించారు స్వామి. ప్రతీ విభాగాన్ని సందర్శించి వారి సందేహాలను అడిగి శ్రామిక, అధికార వర్గాలను ఆనందంలో ముంచెత్తారు శ్రీవారు.

లక్ష్యం కోసం పరితపించే సాధకులకు ఇహపరశ్రేయోదాయిగా సాక్షాత్కరిస్తారు సద్గురుచంద్రులు. త్రికాలవేదులై, సృష్టి,స్థితి,లయ శాసకులై పరిఢవిల్లే సద్గురుచంద్రులు మానవాళి దాస్యశృంఖలాలను



తెంచుకునేందుకు, భగవంతుని 'దాసు'లై ప్రతీ జీవిలోను దైవాన్ని దర్శించుకునేందుకు సహాయపడతారు. కుండపోతగా వర్షించే వారి అనుగ్రహానికి మనమే కట్టుకునే సంకుచిత భావాల అడ్డు'గొడుగు'లను తొలగించుకునే ప్రయత్నం చేయాలి. అంతరంగపు అట్టడుగులలో దొంతరలై పేరుకున్న ఈర్ష్య, అసూయ, ద్వేషాలను అమూలాగ్రం తొలగించమని ఆ చరణాలనంటి ప్రార్థించాలి. సద్ధర్మాచరణ ద్వారా మాత్రమే సుఖశాంతులను పొందే కట్టడిని మనలో నిలపమని సాష్టాంగ ప్రణామం చేయాలి. తమ శాసకత్వంతో సృష్టిని నడపగల్గినా కేవలం భగవంతుని లీలావినోదాన్ని సాక్షీమాత్రంగా స్వీకరించగలిగే వారి పరిణతిలో అణువంత మనలోనూ పాదుకొల్పమని నమస్సులర్పించాలి. సద్గురుచరణ స్ఫురణతో సాగుతున్న ఈ సప్రేమ విజయయాత్రలో మన అడుగులను విశ్లేషించుకుంటూ విజయం 'దిశ'గా సాగుదాం... విజయదశమిని సార్థకం చేసుకుందాం... సద్గురు చరణం శరణం... శుభం భవతు...

– గురుకృప

## రాచబాట ఇది.....

పరీక్షిన్మహారాజా! మీ పెద్దలలోని భాగవత మూర్తులందరూ భగవానుడయిన వ్యాసమహర్షి చేత భాగవత మహాపురాణంలో మునుముందుగా ఎలా కీర్తింపబడ్డారో, ఎంతగా కీర్తింపబడ్డారో విన్నావు కదా! ఆ భాగవత మూర్తులందరూ ఒక్కొక్కరుగా మన అంతరంగంలో సాక్షాత్కరించి, భాగవత మార్గాన నడవదలచిన వారికి అలవడవలసిన మహాలక్షణాలను గూర్చి దివ్యమైన పద్ధతిలో ఎలా ఉపదేశిస్తూ వచ్చారో చూశావు కదా! అందరూ భాగవత మూర్తులే! అందరూ ఆ దేవదేవునికి సర్వసమర్పణ చెందినవారే! ఆ సర్వసమర్పణ స్థితిలో వారుండగా వారి జీవితాలలో, జీవిత సన్నివేశాలలో ఎలాంటెలాంటి దివ్యగుణాలు వ్యక్తమవుతూ వచ్చాయో మనం స్మరించుకున్నాం. మనం దర్శించగలిగాం. **మహాసాధ్వి అయినటువంటి ద్రౌపది నుండి అనితరసాధ్యమైన క్షమాగుణం** వ్యక్తమైంది. తన వంశాన్నే నిర్వంశం చేయడానికి నడుంకట్టిన దుర్భర శత్రువుని క్షమించగలిగిందామె. నావంటి స్థితి ఇంకెవరికీ కలుగకూడదు. చివరకు మీ తల్లికయినా! అని అశ్వత్థామతో అనగలిగిందామె. **పగవారియినా ఈ బాధ కలగవద్దు** అని అనుకుంటూ ఉంటాం మనం చాలాసార్లు. అంటే ఏమిటో అలా అనుకోవడంలోని పరమార్థమేమిటో నరజాతికి ఉపదేశించింది ఆమె! భాగవత మార్గాన నడువదలచిన ఓ సాధకులారా! సహృదయులారా! ముందుగా ఈ క్షమాగుణాన్ని, ఇలాంటి



క్షమాగుణాన్ని మనం అలవరచుకోవాలి సుమా! ఇతరులు మనకు ఏమి చేయకూడదనుకుంటున్నామో, మనం దానిని ఇతరులకు చేయకూడదు. చివరకు మనపట్ల అలా చేసిన వారికి కూడా మనం అలా చేయకూడదు, అపకారికి కకూఎడా ఉపకారం చేయవలె–అన్న దివ్యసందేశాన్ని మహోన్నతమైన స్థితిలో నుండి మానవజాతికి అందిస్తున్నదామె.

ఇక మీ తల్లి ఉత్తర అమృతమూర్తి! ఆమె ప్రవర్తన మనకేమి తెలియచెబుతున్నది? భాగవత మార్గాన నడువదలచినవారు తమను తాము మరచిపోవాలని! తమచుట్టూ ఉన్నవారి కోసం, తమను ఆశ్రయించుకొని ఉన్నవారికోసం తమని తాము అర్పించుకోవాలని! ఎంతటి ఉపదేశమది! ఆమె ఏమన్నది దేవదేవునితో! నా కడుపులోని బిడ్డ అస్త్రాగ్నికి ఆహుతైపోతున్నాడు. రక్షించు ప్రభూ! అతడిని రక్షించు – అన్నది. మరి ఆ అస్త్రాగ్ని ఆమెను దహించివేయడం లేదా! ఆ ప్రసక్తి అక్కడ లేనే లేదు! ఉండదు! ఎందుకని! ఆమెకు ఆమె గుర్తులేదు కనుక! తనకు తాను గుర్తుండి, **తన కొరకు తాను వెంపరలాడే సాధారణ స్థితి నుండి ఆమె ఎప్పుడో ఈవలకు వచ్చింది కనుక! ఆమె అలా అనలేదు. ఆమె అలా 'అన'లేదు!**

క్షమ అంటే ఇదీ అని ద్రౌపది తెలియచెబుతున్నది. ప్రేమ అంటే ఇలా ఉంటుందని ఉత్తర తెలియచెబుతున్నది. మరి కుంతి ఏమి తెలియచెబుతున్నది? కడదాకా కర్తవ్యం వెంట కదలి సాగడమెలాగో తెలియచెబుతున్నది. కష్టనష్టాలు ఆమె ప్రయాణాన్ని ఆపలేవు. సుఖభోగాలు ఆమె ప్రయాణాన్ని అడ్డుకోలేవు. ఆశ్చర్యం కదూ! లోకంలో ఈ రెండింటి పేరనే మనిషి కర్తవ్య నిర్వహణ నుండి చెదిరిపోతాడు. ఇంకా చెప్పాలీ అంటే కర్మ భ్రష్టుడయిపోతాడు. కష్టానష్టాలు వస్తున్నాయి. కష్టనష్టాలు కమ్ముకు వస్తున్నాయి! ఇంక నేనేం చేయగలను? మీరే చెప్పండి అంటాడు. సుఖభోగాలు చేరవస్తున్నాయి. సుఖభోగాలు ఇన్నాళ్ళకు నా జీవితంలో అందివస్తున్నాయి. వీటిని తగుమాత్రంగానైనా అనుభవించకుండా నేనెలా ముందుకు సాగగలను? మీరే చెప్పండి అని అంటున్నాడు. అంటే దానర్థం ఏమిటి? కష్టసుఖాలు వస్తే అతడిక కదలలేదు. సుఖభోగాలు వస్తే ఇక సాగలేడు. మరి ఇంకెప్పుడు కదులుతాడు? కష్టనష్టాలొచ్చినా, సుఖభోగాలు హెచ్చినా, మనం మాత్రం ఉండవలసింది కర్తవ్యనిర్వహణలోనే! కష్టనష్టాల మధ్య నుండి మనం కర్తవ్యం వైపుకే చూడాలి! సుఖభోగాల మధ్య నుండి మనం కర్తవ్యం వైపుకే చూడాలి అని.



తన బావగారు, సాక్షాత్తు ఆ దేశానికి చక్రవర్తి. తనను బిడ్డలతో సహా తరిమి తరిమి కొట్టాడు. అయినా ఆమె బెదిరిపోలేదు. కర్తవ్యమేమిటో గమనించుకుంటూ ఆమె కదిలిపోయింది. కథను ముందుకు నడిపింది. దేవదేవునే ఆ కథలోనికి ఒక పాత్రధారిగా ఆహ్వానించింది. కష్టాలమధ్య నుండి, కన్నీళ్ళ మధ్య నుండి, కర్తవ్యం వెంట సాగిపోయిందామె. ఎంతగా సాగిపోయింది అంటే దేవదేవుడే ఆమెను చూసి ముచ్చట పడేటట్లుగా సాగిపోయింది! ఆయన ఎంతగా ముచ్చటపడ్డాడు అంటే "అత్తా! ఇకపైన జరుగవలసినది ఏమిటి? అని ఆమెను అడిగే వాడయ్యాడు. అది నీకు తెలియనిదా?" అన్నట్లు చూసేదామె.

అలాంటి ఆమె చివరకు తనను తరిమికొట్టినవాళ్ళే తన చెంత దీనులై నిలిచినవేళ, తన ఆశ్రయంలో శేషజీవితాన్ని వెళ్ళబుచ్చుకునే స్థితిలో పడినవేళ, సుఖభోగాలు తనను చుట్టుముట్టినవేళ. రాజమాత పదవి తనను కోరి వరించినవేళ, అంతటి విజయాల మధ్య నుండి ఆమె ఏమంటున్నది? **'కన్నయ్యా! ఇక నా కర్తవ్యమేమిటి?' అంటున్నది. 'ఇన్నిటి మధ్యలో ఉన్న నన్ను, నీ సంకల్పానికి అనుగుణంగా నడిపించు ప్రభూ!' అని కోరుతున్నది. సుఖభోగాలను అనుభవించడంలో కన్నా, నీ సంకల్పానికి అనుగుణంగా ప్రవర్తించడంలోనే నాకు నిజమయిన సుఖమున్నది అంటున్నది. అంతేకదా! కర్తవ్య నిర్వహణలోనే కదా సుఖమున్నది. ఆ కర్తవ్య నిర్వహణ ఆ దేవదేవుని సంకల్పానికి అనుగుణంగా సాగినపుడే కదా సుఖమున్నది. కష్టనష్టాలయినా, కర్తవ్య నిర్వహణకు దోహదాలే! సుఖభోగాలయినా కర్తవ్య నిర్వహణకు సోపానాలే!** ఎంత చక్కగా చెప్పిందామె! వాటిని చూచి ఆగవద్దు అంటున్నది. వాటి మధ్యగా సాగిపోమంటున్నది! కర్తవ్య నిర్వహణకు వాటిని దోహదాలుగా, సోపానాలుగా స్వీకరిస్తూ కదలిపోమంటున్నది. ఏమి సందేశం! శ్రీకృష్ణుని గీతాబోధ ఇలా ఒక కుంతిగా – ఆ కుంతి జీవితంగా రూపుదిద్దుకున్నట్లుగా గోచరించడం లేదూ! గీత అర్థం కావాలి అంటే కుంతి అర్థం కావాలి. ఆమె నడిచిన 'గీత' జీవితరూపంలో నడిచిన భగవద్గీత! ఎలాంటి దివ్య గుణాలను అలవరచుకోవాలో ఒక ద్రౌపదీ, ఒక ఉత్తర చెబుతూ ఉంటే, ఆ దివ్యగుణాలను అలవరచుకుంటూ కర్తవ్యం వెంట ఎలా సాగిపోవాలో కుంతీదేవి ఉపదేశిస్తున్నది. భాగవత మార్గాన నడువదలచిన వారు కర్తవ్యపథాన కడదాకా ఎలా సాగిపోవాలో సూచిస్తున్నది ఆమె. చూపిస్తున్నది ఆమె.

**కర్తవ్య నిర్వహణలో ముందుకు సాగేటపుడు అడుగడుగునా ఆ దేవదేవుని గమనించుకుంటూ అతని అడుగులో అడుగువేసే ప్రయత్నం నిరంతరం ఎలా జరుగుతూ ఉండాలో చూపించేవాడు**



**భీష్మాచార్యుడు.** ఆ అడుగులో నుండి ఈ అడుగు తప్పితే ఎంతటి ఇబ్బంది రావడానికి అవకాశమున్నదో మనకు ఉదాహరణ పూర్వకంగా దర్శింపచేస్తాడాయన. మళ్ళీ ఆ అడుగులో అడుగుపడేటట్టు చూసుకునే విషయంలో ఆయన ఎంతగా తపించి పోయాడో మనం చూసాం కదా! **ఆయన మొహమాటపడలేదు! సరిపెట్టుకోలేదు! సమర్థించుకోలేదు! కావలసిన సమన్వయం కోసం పరితపించిపోయాడు. దేవదేవుని నుండి ఆ సమన్వయం అందీ అందగానే తన జీవితంలో వెంటనే అమలు పరచుకున్నాడు. భాగవత మార్గంలో నడవదలచిన వారు తమను తాము సరిదిద్దుకోవడానికి ఎంతగా పరితపించాలో, కావలసిన సమన్వయం లభించినపుడు అందుకొని దానినమలు పరచుకోవడానికి ఎంతగా సంసిద్ధులయి ఉండాలో మనకు చక్కగా చూపిస్తున్నాడాయన.** భాగవత మార్గంలో నడవదలచిన వారు తామెంతటి వారము అనిగాక, తాము ఎక్కడున్నాము – అన్న అంశాన్ని గూర్చి చిత్తశుద్ధితో పరిశీలించుకుంటూ ఉండాలని ప్రబోధిస్తున్నాడాయన.

**జీవితంతో ఎదురయ్యే సన్నివేశాలను కష్టాలుగా గాక, సమస్యలుగా గాక, సాధనలోని భాగాలుగా, పాత్ర పోషణకు ఆవశ్యకమయిన అంశాలుగా స్వీకరించాలంటున్నాడు ధర్మజుడు. పెద్దల నుండి నిరంతరం శిక్షణ పొందుతూ, వారికి కూడా ముచ్చట కలిగేలాగున 'జీవించడమేలాగున' అన్న అంశాన్ని తన జీవన విధానం ద్వారా నరజాతికి ఉపదేశిస్తున్నాడు ధర్మజుడు.** వారి నుండి తెలిసినదానినే మళ్ళీ తెలుసుకుంటూ ఉంటాడు. విన్న దానినే మళ్ళీ వింటూ ఉంటాడు. వారి జీవితాలను శ్రద్ధగా గమనిస్తూ, తన జీవన విధానానికి నిత్యమూ మెరుగులు దిద్దుకుంటూ ఉంటాడు. పెద్దల రూపంలో వెలుగుతున్న దేవదేవునికి చేతులతో, చేతలతో నమస్కరిస్తూ ఉంటాడు. వారి సేవను ఒక అర్చనగా నిర్వహిస్తూ ఉంటాడు. భాగవత మార్గాన నడవదలచిన వారికి అన్ని విధాలా ఆదర్శంగా నిలబడగలిగిన వాడితడు. మిగిలిన వారందరూ భాగవత మార్గాన నడవదలచేవారు అలవర్చుకోవలసిన దివ్యగుణాలను, గ్రహించుకోవలసిన సూక్ష్మాంశాలను తెలియచెపుతూ ఉండగా, ఆ అలవరచుకోవడం కోసం, ఆ గ్రహించుకోవడం కోసం నిత్యజీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో మనకు తెలియ చెబుతున్నవాడు ధర్మజుడు. శుకయోగి గొంతు ఆర్ద్రమవుతున్నది. పరీక్షిత్తు కన్నులు చెమ్మగిల్లుతున్నవి.

**– శ్రీమద్భాగవతము దివ్యజీవన మార్గము**

## "సాయి ఊసే - సాయి ధ్యాసే
## లేదు లేదిక వేరే బాట"



నేనెప్పుడూ ఎవరికీ మెథడ్స్ చెప్పనయ్యా, మెథడ్స్ అంటూ ఏమీ లేవు. మార్గాలంటూ ఏమీ లేవు. టెక్నిక్స్ అంటూ ఏమీ లేవు. నేను చెప్పేదేమిటంటే ఎవరి మార్గాన్ని వాళ్ళు ఆవిష్కరించుకోవాలి.



మన అవసరానికి అనుగుణంగా మనం ఉండేటువంటి పరిస్థితికి అనుగుణంగా ఆవిష్కరించుకోవాలి. మొత్తానికి సారాంశం ఏమిటనంటే మన మనస్సు బాబా మీద ఉండాలి. అలా ఉండటానికి ఏమి చేసినా అది సత్సంగమే.



ఏమి చేసినా అది మార్గమే. ఏమి చేసినా మనస్సు బాబా మీద లేకపోతే మాత్రం ఇవన్నీ కూడా వ్యర్థమే. భజన చేస్తే బాబా మీద మనసు ఉంటుందా? లేదు. మనము బాబా మీద పెట్టడానికి ఏ రకమైన సాధనలు ఉంటే అవి చేయండి. సాయి ఊసే సాయి ధ్యాసే లేదు లేదిక వేరే బాట... ఇంకా వేరే బాట, వేరే మార్గాలు,వేరే టెక్నిక్స్ అంటూ ఏమీ లేవు. ఈ సాయిఊసు, సాయిధ్యాసలో ఉండటానికి మనం ఏమి చేసినా అది సత్సంగమే అవుతుంది. సాధనే అవుతుంది.

– శ్రీబాబూజీ

# ప్రేమాక్షర సన్నిధి

కృష్ణభిక్షు అనే భగవాన్ సన్నిహిత భక్తుడు "శ్రీరమణలీల" పేరుతో తెలుగులో భగవాన్ జీవితచరిత్రను రచించారు. అది తెలుగులో ఒక ప్రామాణిక గ్రంథంగా నిలిచింది. కృష్ణభిక్షు ఒకసారి నాతో ఇలా అన్నారు. "నేను ఒకసారి భగవానులను "భగవాన్, ఇప్పుడు మీ సన్నిధిలో మేమెంతో ఆనందంగా ఉన్నాము. మరి మీరు వెళ్ళిపోయిన తరువాత మా పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించాను. దానికి భగవాన్ తక్షణమే "దానికేముందని, చరిత్ర ఉంది కదా అన్నారు". భగవాన్ తమ జీవిత చరిత్రను దాదాపు తమకు సరిసమానమైన ప్రత్యామ్నాయంగా సూచించారు. అలా భగవాన్ మరోసారి మహాత్ముల జీవిత చరిత్రల ప్రాముఖ్యతను తెలియచేసారు.



సన్నిహిత భారతీయ భక్తులకు కూడా మహాత్ముల చరిత్రలు చదవమని భగవాన్ చెప్పేవారు. భగవాన్‌ని సైతం ప్రభావితం చేసింది మహాత్ముల జీవిత చరిత్రలే. అరవైమూడు మంది నయనార్ల (శైవభక్తులు) జీవిత చరిత్రలతో తమిళంలో రచింపబడిన "పెరియపురాణం" రమణులను ఎక్కువ ప్రభావితం చేసింది.

– శ్రీబాబూజీ